

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి :14  సంచిక: 08 హైదరాబాద్  2014  డిశంబరు పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com**  **వార్షిక సభ్యత్వం : రూ.100/-**

# యాప్రాల్‌లో ఏకాహం

2015 జనవరి 18, ఆదివారం ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ ప్లాట్ నెం.32, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, సికింద్రాబాద్ -500 087, (ఫోన్- 99595-53218) అవతారుని ఏకాహం ఏర్పాటు చేయడమైంది. బాబా ప్రేమికులందరూ వీలుచూసుకుని ఈ ఏకనామంలో పాల్గొనవల్సిందిగా శ్రీ మల్లాది కృష్ణానంద్ కోరుతున్నారు.

యాప్రాల్ చేరుటకు సికింద్రాబాద్‌లో వున్న పాస్‌పోర్టు ఆఫీసు నుండి సిటీ బస్సు నంబరు 24, 24బి (యాప్రాల్‌లోని వాటర్ ట్యాంక్ స్టేజి, ఆంధ్రా బ్యాంక్ ఎదుట) ప్రతి ఐదు నిముషాలకు వుంది. కాగా, సొంత వాహనాలలో వచ్చేవారు తిరుమలగిరి జంక్షన్ నుంచి యాప్రాల్ వాటర్ ట్యాంక్ స్టేజి, ఆంధ్రా బ్యాంక్ దగ్గర నుండి అర్ధ కిలోమీటరు దూరంలో గోదావరి గార్డెన్సు, ప్లాట్ నంబరు 32 ఉంది.

**ఏకనామంలో కొన్ని క్షణాలైనా పాల్గొనాలనుకోవడం అవతారుడు కల్పించిన ఒక మహత్తర అవకాశంగా భావించాలని, వీలుచూసుకుని బాబా ప్రేమికులందూ తప్పక హాజరుకావల్సిందిగా శ్రీ మల్లాది కోరుతున్నారు.**

# అమరతిథి-ఆంధ్రా గెస్టు హౌసు

2015 జనవరి 31న 46వ అవతారుని అమరతిథికి విచ్చేసే బాబా ప్రేమికులు, ముఖ్యంగా ఆంధ్రాగెస్టు హౌసుకు జీవిత సభ్యత్వం చెల్లించిన వారు, వయస్సురీత్యా పెద్దవారు, తమ వివరాలను 2014 డిశంబరు 31లోగా నమోదు చేయించుకోవల్సిందిగా కార్యదర్శి శ్రీ వై. శ్రీనివాస్ కోరుతున్నారు. గెస్టుహౌసులో వసతి సౌకర్యం ఏర్పాటులో వృద్ధులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. అలాగే వారందరూ అమరతిథి కార్యక్రమాలకు హాజరవ్వడానికి తగిన వాహన సౌకర్యం ఉచితంగా 24**X**7 గెస్టు హౌసు నుండి ఏర్పాటు చేశామని శ్రీనివాస్ తెలిపారు. మరిన్ని వివరాలకు మేనేజర్, 0241-2548544 సంప్రదించగలరు.

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్ నామ వ్యాప్తికి మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రిక వార్షిక లేక జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలకు 995 955 3218 సంప్రదించగలరు.

# బాబా సందేశం

మనస్సులోకి ఎలాంటి ఆలోచనలు దరిరానీయకుండా కనీసం 12 సెకండ్లు అదుపులో పెట్టగలిగినవారు ఆధ్యాత్మి ఉన్నతి సాధించగలరు.

**If anyone can consciously keep thoughts silent for even 12 seconds he would achieve a very advanced spiritual state**

**- మెహెర్‌బాబా**


గౌరవ సంపాదకులు
మల్లాది కృష్ణానంద్
**99595-53218,**
**040-65553218**
**malladisukku@gmail.com**

*వ్యవస్థాపకులు:*
**దశిక ప్రసాదరావు**
**040-65699611**


## లోపలి పేజీలలో...


| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. 46వ అమరతిథి | 6-17 |
| 3. మా మాటలు | 18-19 |
| 4. లార్డ్ మెహెర్ | 20-27 |
| 5. కొత్తపుస్తకం | 28 |
| 6. T.O.M.B. | 29 |
| 7. తెలుగు సహవాస్ | 30-36 |
| 8. మా మాటలు | 37 |
| 9. జీవిత సభ్యుల వివరాలు | 38-39 |



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


**మనవి**

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# 46వ అమరతిథి

అవతారుని 46వ అమరతిథి రెండున్నర రోజులపాటు 2015 జనవరి 30 ఉదయం 8 గంటల నుండి ఫిబ్రవరి 1 మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నారు. కాగా, 2015జనవరి 31వ తేదీ అత్యంత ప్రధానమైన రోజు. ఆ రోజున అవతార్ మెహెర్‌బాబా సమాధి ఎదురుగా మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకు బాబా ప్రేమికులందరూ మౌనం పాటించే సమయమని ప్రత్యేకంగా గుర్తించాలి.

## వసతి సదుపాయం

మెహెరాబాద్‌లో వసతి సౌకర్యం కోరుకునే యాత్రికులు ఒక్కొక్కరికి రూ. 50/- చొప్పున నగదును "అమరతిథి డొనేషన్స్" పేరిట పోస్టల్ మనీ ఆర్డరు లేదా బ్యాంక్ డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా మెహెర్‌బాబా ట్రస్టు అడ్రస్సు – 'అమరతిథి డొనేషన్స్", అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టు, పోస్ట్ బ్యాగ్ నెం. 31, కింగ్స్ రోడ్, అహ్మద్ నగర్, మహారాష్ట్ర – 414 001 పంపాలి. ఇందుకు ఆఖరు తేది 2015 జనవరి 7. ఏడు సంవత్సరాల లోపు పిల్లలకు ఎలాంటి సొమ్ము వసూలు చేయరు.
ఎలక్ట్రానిక్ మనీఆర్డర్ ద్వారా మీరు "అమరతిథి డొనేషన్స్" పంపుతున్న ఎడల మీ పేరు ప్రక్కనే ఎంత మంది పురుషులు / స్త్రీలు తెలియచేయాలని కోరుతున్నారు.
ముందుగా నగదు పంపలేని పక్షంలో 2015 జనవరి 30, 31 తేదీల్లో దిగువ మెహెరాబాద్‌లోని విచారణ కౌంటర్ల వద్ద ఒక్కొక్కరికి రూ. 100/- చొప్పున చెల్లించవలసి ఉంటుందని ట్రస్టు సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
**పరుపులు:** పరుపుల కాంట్రాక్టరు రెండు రోజుల బసకు ఒక్కొక్క పరుపుకు రూ.50/- చొప్పున అద్దెకు ఇవ్వనున్నారు. ఇందుకోసం ముందుగా –శ్రీమతి ఉషా.అశోక్ సేట్, బంగ్లా నెం. 93, ఉషాకాల్, ఆనంద్‌నగర్, గుల్‌మొహర్ రోడ్, సావేడి, అహ్మద్‌నగర్, మహారాష్ట్ర – 414 003 కు తగిన నగదును మనీ ఆర్డర్ ద్వారా పంపవలెను.
భజనలు, పాటలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించదల్చుకునేవారు, శ్రీ మెహెర్‌నాథ్ బి.కల్చూరీ, ట్రస్టీ, అవతార్ మెహెర్‌బాబా పి.పి.సి. ట్రస్టు, పోస్ట్ బ్యాగ్ నెం. 31, కింగ్స్ రోడ్, అహ్మద్‌నగర్, మహారాష్ట్ర – 414 001, అనే చిరునామాకు 2014 డిసెంబరు 31వ తేదీ లోగా తెలియజేయాల్సిందిగా కోరుతున్నారు.
**అమరతిథికి వెళ్ళడానికి, అవతారుని ఆశీశ్శులు అందుకోవడానికి నేటి నుండే సిద్ధంకండి!**

# సంపాదకీయం జనవరి 31

నేటి మానవాళి గుర్తుంచుకోవల్సిన రోజు – జనవరి 31
1969 జనవరి 31 నుండి మెహెర్‌బాబా తనను దర్శించడానికి వచ్చిన వారిని
సశరీరులుగా కలవటం మానివేశారు. **అదే అమరతిథి.**
అవతారుడు సర్వే సర్వత్రా వున్న వైనానికి అర్థం పడుతుందీ రోజు.
మెహెర్‌బాబా భౌతికంగా నేడు మన మధ్యన లేకపోయినా
ఆయన తమ కార్యక్రమాల్ని యథావిధిగా నిర్వహిస్తున్నారు.
ఇది వారి విశ్వకార్యక్రమం. అది ఏమిటో ఇతమిద్ధంగా అందరికీ తెలియదు.
బాబావారు సశరీరులుగా వున్నప్పుడు తమ కార్యక్రమాన్ని రెండు స్థాయిల్లో చేసేవారు.
ఒకటి మనందరి కళ్ళకి కనిపించే భౌతిక ప్రపంచం,
రెండవది మన కళ్ళకి కనబడని ఆంతరంగిక ప్రపంచం ద్వారా
తమ దగ్గరకి వచ్చిన అందరి సంస్కారాలనీ ఆయన తీసుకొనేవారు.
తన వద్దకు రాని వారికీ ఈ వరాన్ని ప్రసాదించే వారు.
అవతారుడు యావత్తు మానవాళికి ఆధ్యాత్మికోన్నతి కల్గిస్తున్నాడు.
ప్రపంచంలో ఎన్నో మతాలున్నాయి. ఎందరో అవతార పురుషులున్నారు.
ఒక్కో మతానికి ఒక్కో అవతారుడు. మతాలు వేరైనా అవతారుడు ఒక్కడే.
ప్రతి యుగంలో భూమిపై అవతరిస్తున్న పరాత్పరుడు ఒక్కడే.
పేరు, రూపం, రంగు వేరు అంతే. యుగ యుగాలుగా అవతరిస్తున్న
దేవ దేవుడు ఒక్కడేనన్న నగ్న సత్యాల్ని మనం బాగా జ్ఞాపకం పెట్టుకోవాలి.
అవతారుడు శరీరం వదలిపెట్టినా, సజీవంగానే వుంటారు.
తమ విశ్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే వుంటారు.
వందేళ్ళ వరకూ అవతారుడు చురుకుగా పనిచేస్తూనే వుంటారు.
ఈ కాలంలో మీరు పిలిచినా, పిలవక పోయినా మీకు సహాయం చేస్తాడు.
అయితే వంద ఏళ్ళు అయ్యాక ఆయన విశ్రాంతికి వెళ్ళిపోతాడు.
అప్పుడు కేవలం పిలిచితే పలికే దైవం – అవతారుడు. ఇది అవతారుని ఉవాచ.

* * * * *

2015 జనవరి 31 నాటికి మెహెరాబాద్ వెళ్ళడానికి ఇప్పటి నుండే చాలా మంది తగిన సన్నాహాలు చేసుకుంటున్నారు. మెహెరాబాద్‌లో ప్రతి ఒక్కరూ జనవరి 31, మధ్యాహ్నం 12 నుండి 12.15 దాకా బాబా నామస్మరణలో మౌనం పాటిస్తారు. మెహెరాబాద్ దాకా వెళ్ళలేకపోయినా, మీరెక్కడున్నా ఆ పదిహేను నిముషాలు మౌనంగా భగవన్నామ స్మరణలో గడపాలనుకోవడం ముదావహం!!

# 46వ అమరతిథి



అవతార్ మెహెర్‌బాబా భౌతికంగా నేడు మన మధ్యన లేరు. కానీ, ఆయన తన భక్తులతో, ప్రేమికులతో నిత్య సహచరునిగా వున్నారు. మెహెర్‌బాబాను ప్రేమించే వారికి, ఆయన్ని ఆరాధించే వారందరికీ ఆయన్ని పిలిస్తే ప్రతిక్షణం పలుకుతున్నాడు. మనస్సులో అనుకున్నదే తడవుగా ఆయన వారికి మరింత చేరువగా వుంటున్నాడు. మెహెర్‌బాబా 1969 జనవరి 31న తన భౌతికదేహ త్యాగం చేశారు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా కేంద్రానికి సుమారు 5 కి.మీ. దూరంలో గల మెహెరాబాద్‌లో, చిన్న కొండపైన మెహెర్‌బాబా సమాధి వుంది. ఈ సమాధిని 1930వ దశకంలోనే మెహెర్‌బాబా స్వీయ పర్యవేక్షణలో చాలా నిరాడంబరంగా నిర్మించారు. 2015 జనవరి 31న మెహెర్‌బాబా 46వ అమరతిథి వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. బాబా భక్తులు అధిక సంఖ్యలో జనవరి 30 నాటికే మెహెరాబాద్‌లోగల బాబా సమాధి ప్రాంగణానికి చేరతారు. జనవరి 30, 31, ఫిబ్రవరి 1వ తేదీలలో మూడు రోజులు ప్రత్యేక అమరతిథి కార్యక్రమాలు ఇక్కడ

నిర్వహిస్తున్నారు. కాగా, రాష్ట్రంలో కూడా పలు ప్రాంతాలలో, మెహెర్‌బాబా సెంటర్లలో జనవరి 31న అవతారుని అమరతిథి వేడుకలు జరుపుతారు. మెహెరాబాద్‌దాకా వెళ్ళలేని వారు పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో గల మెహెరస్థాన్‌కు, హైదరాబాద్‌లోనైతే ఈసామియాబజార్‌లోని కోఠి మెహెర్ సెంటర్, లేదా జూబ్లిహిల్సు రోడ్డు నంబరు 36 చివరన గల జూబ్లి సెంటర్‌లకు బాబా ప్రేమికులు పెద్దఎత్తున హాజరవుతారు. అలాగే, రాష్ట్రంలో గల అన్ని జిల్లాలలో మెహెర్‌బాబా కేంద్రాలున్నాయి. అన్నింటా కూడా అమరతిథి వేడుకలు ఘనంగా జరుపుతారు.

అవతార్ మెహెర్‌బాబా 1969 జనవరి 31 మధ్యాహ్నం 12 గంటల సమయంలో భౌతిక దేహత్యాగం చేశారు.

కాబట్టి మెహెర్‌బాబా భక్తులందరూ మెహెరాబాద్‌లోని బాబా సమాధి దగ్గర జనవరి 31న మధ్యాహ్నం 12 గంటల నుండి 12.15 వరకూ మౌనావతారుడైన మెహెర్‌బాబాను స్మరిస్తూ అందరూ మౌనంగా ఉంటారు. అదేవిధంగా అన్ని మెహెర్‌బాబా కేంద్రాలలో ఆ సమయంలో బాబా భక్తులు మౌనం పాటిస్తారు. **ఏదేని కారణంగా, పని ఒత్తిడిలో బాబా కేంద్రాలకు వెళ్ళలేనివారు వారెక్కడ వున్నా జనవరి 31 మధ్యాహ్నం 12 గంటల నుండి 12.15 నిముషాల సమయంలో మెహెరుడిని తలుచుకుంటూ అవతారుని దివ్యాశీశ్శులు పొందగలరు. ఇదొక అరుదైన మహత్తర అవకాశంగా భావించవల్సింది.**

మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి మౌనంలో వున్నారు.

మౌనంగా వుంటూనే ఆయన అనేక సందేశాలు సమస్త మానవాళి కోసం అందజేశారు. మౌనంగా వుంటూనే - ఆయన గాడ్ స్పీక్స్- **'భగధ్వచనం'**- అనే గ్రంథం రాశారు. ఇప్పటికే అనేక దఫాలు పునర్ముద్రితమైన ఈ గ్రంథం, కనీసం ఒకసారైనా చదవమని బాబా తన భక్తులను కోరారు.

ఈ గ్రంథాన్ని మహాత్మాగాంధీకి, భారత తొలి ప్రధాని పండిట్ జవహార్‌లాల్ నెహ్రూ, ఇలా పలువురు పెద్దలు- ప్రముఖులకు సయితం బాబా భక్తులు అందజేశారు. అన్ని బాబా కేంద్రాలలో భగవద్వచనం ప్రతులు లభ్యమవుతున్నాయి.

మెహెర్‌బాబా మానవ రూపంలో వచ్చిన సాక్షాత్తూ ఈ యుగావతారుడు, భగవంతుడు. భగవంతుడు మానవరూపంలో మన మధ్యకు వచ్చినప్పుడు ఏ యుగంలోనైనా - భగవంతుడిని దరిచేరి, ఆరాధించి, ప్రేమించిన వారి సంఖ్య పరిమితంగానే వుంటుంది.

**అనంతమైన భౌతిక బాధలు**

మెహెర్‌బాబా సమస్తమానవాళి కోసం భౌతికంగా అనంతమైన బాధలు అనుభవించారు. ఎన్నో సంవత్సరాలు ముందుగానే మెహెర్‌బాబా 1969 జనవరి

31న తన దేహత్యాగం గురించి అనేక సంకేతాలు ఇచ్చారు. 1969 ఏప్రిల్ 10 నుండి జూన్ 10 వరకూ మూడు నెలలు పూనేలోని గురుప్రసాద్ భవనంలో తన దర్శనం, సహవాస్ తన ప్రేమికులకు ఇస్తానని మెహెర్‌బాబా ప్రకటించారు.
కానీ, 1969 జనవరి నెలలోనే ఆయన ఆరోగ్యం బాగా క్షీణించింది.
ఆయన దేహంలోని రక్తంలో యూరియా శాతం అనూహ్యంగా పెరిగింది.
ఇది పరిశీలించిన వైద్యులు మెహెర్‌బాబాను తక్షణం వైద్య పరీక్షల నిమిత్తం పూణేలోని పెద్ద ఆసుపత్రికి తరలించాలని కోరారు.
కానీ, మెహెర్‌బాబా అందుకు అంగీకరించలేదు.
ఆయన దగ్గర అతి సన్నిహితంగా వుండే బాబా ప్రేమికులు,
బాబా మండలి సభ్యుల ఆవేదనను ఆయన సున్నితంగా తిరస్కరించారు.

**If you want me to drop this body, then take me to Pune!**
**Otherwise, don't talk of going there !!**

అని బాబా సంజ్ఞలతో పూనేకి వెళ్ళడాన్ని వారించారు.
అదేసమయంలో మండలివారిని బుజ్జగించే ధోరణిలో
తన దర్శన సహవాస్ విషయమై ప్రస్తావిస్తూ
నేను నా భక్తులకు, ప్రేమికులకు పడుకుని దర్శనమిస్తాను.
అలాచేస్తే బాగుండదా?? అని ప్రశ్నించారు.

**"If I give my darshan to my lovers lying down,**
**would there be anything wrong in that, He asked"**

అలా ఏం లేదు బాబా.
నీకు ఎలా వీలుగా వుంటుందో అదే మేమందరం కోరుకుంటాం అని,
బాబా మండలి జవాబిచ్చారు.
1969 ఏప్రిల్ నుండి మూడు నెలల పాటు పూణేలో
దర్శన - సహవాస్ నిర్వహిస్తామని సమాచారం అందరికీ పంపాం.
బాబా ఆరోగ్య పరిస్థితి బాగాలేదు కదా!
ఈ పరిస్థితుల్లో బాబా దర్శన కార్యక్రమం సాధ్యమవుతుందా?
వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తే ఎలా వుంటుంది అని బాబా మండలి వారు
ఆందోళన చెందుతుంటే,
ఇది గమనించిన అవతారుడు ఏమన్నారో తెలుసాండి!!
ఈ దఫా తానిచ్చే ఆఖరి దర్శనం చాలా విభిన్నమైంది.
మౌనావతారునిగా తానిచ్చే ఈ దర్శనం చిట్ట చివరిది,
అనన్య సామాన్యమైనదీ అన్నారు.

**"It will be different from all darshans,**

**and it will be the last in silence.**

It will be the darshan of darshans unparalleled" అన్నారు.
ఇలాగే మరో సందర్భంలో
"ఏమీ ఆలోచించకండి. బాధపడొద్దు. ఈ నెలాఖరుకల్లా (జనవరి 1969)
అంతా బాగు- బాగు"- అని సందేశమిచ్చారు.

**Don't worry. All will be well by the end of this month**

ఈ మాటల్లో నిక్షిప్తమైన గూఢార్థం
మెహెరుని సన్నిహితులకు సయితం చివరిక్షణం దాకా గ్రహించ లేదు.
జనవరి 10 నాటికి అవతారుని ఆరోగ్యం క్రమేణా క్షీణించసాగింది.

**I am God and I suffer for everyone,**
**but if you go on serving me as conscientiously as you are now,**

I will get well అని బాబా అన్నారు.
జనవరి 12 తర్వాత బాబా మండలి హాలులోకి రాలేదు.
రోజురోజుకీ ఆయన ఆరోగ్యం మరింత క్షీణించసాగింది.
మండలి సభ్యురాలు డాక్టర్ గోహెర్ బాబాకు దగ్గరగా వుండి వైద్య సేవలు
అందజేసింది. బాబా ఆరోగ్యం బాగాలేకున్నా
తన మండలి ప్రేమికుడు, భావూ కల్చూరీ పుట్టినరోజు జనవరి 13న గుర్తుంచుకుని,
ఆ రోజున బాబా భావూని దగ్గరగా తీసుకుని, ప్రేమతో తన ఆలింగనం ఇచ్చారు.
మెహెరాబాద్‌లో జనవరి 14న సంక్రాంతి పండుగను వేడుకగా జరుపుకున్నారు.
ఆ రోజున పాశ్చాత్య బాబా ప్రేమికుడు డాన్-ఇ-స్టీవెన్స్- బర్త్‌డే జరిపారు.
బాబా అందరికీ స్వీట్లు పంచారు. డాన్‌కు బాబా తన ఆలింగనం ఇచ్చారు.
జనవరి 24న బాబా ప్రేమికుడు ఆస్ట్రేలియన్ దేశీయుడు,
కవి- పండితుడు ఫ్రాన్సిస్ బ్రాబ్‌జాన్ బర్త్‌డేని కూడా బాబా సమక్షంలో
ఘనంగా జరిపారు. ఆ రోజున బాబా బ్రాబజాన్‌ని ప్రేమతో తన అక్కున తీసుకున్నారు.
ఆ రోజు రాత్రిపూట భావూజీతో బాబా సంజ్ఞలతో ఇలా అన్నారు.
"నేను చెప్పేది శ్రద్ధగా వినమన్నారు.
నా జీవిత చరిత్రని పద్యరూపకంలో రాయమని ఆదేశించారు.
బాబా తీవ్ర అనారోగ్యంతో బాధలో వున్నారు.
అంతటి బాధలో కూడా భావూజీని 800 పుటలలో తన జీవిత కథను,
అందరికీ అర్థమయ్యేరీతిలో, సులువుగా వుండే భాషలో రాయమని,
తాను సహాయపడతానని భావూతో అన్నారు.
నీవు ఏది రాసినా నాకు నచ్చుతుందన్నారు.
నీవు బాగా రాయగలవన్నారు.

**Listen carefully to what I say.**
**I am giving you very important work.**
**I want you to write my biography in verse.**
ఈ మాటలు బాబా చెప్పేటప్పుడు ఆరోగ్యం బాగా లేక తీవ్ర ఇబ్బంది పడ్డారు.
ఆ బాధను చూడలేక ఇప్పుడేమీ వద్దు బాబా,
నీ ఆరోగ్యం కుదుటపడ్డాక అన్నీ వివరంగా చెబుదువులే
అన్న భావూ మాటల్ని బాబా లెక్కచేయలేదు.
బాబా తన సంజ్ఞలు కొనసాగిస్తూ....
**I tell you honestly.**
**Remember it, I like your writing very much.**
**And when I like it,**
**what more do you want** అని బాబా తిరిగి అన్నారు.
బాబా ఆదేశాల ప్రకారం భావూజీ ఆ దరిమలా హిందీలో
అవతారుని జీవిత చరిత్రను 'మెహెర్ దర్శన్' పేరిట పద్యంలోనూ,
వచనంలో – **'మెహెర్‌ప్రభు'** అని రాశారు.
అలాగే, ఇంగ్లీషులో ఈ గ్రంథం Lord Meher పేరిట లభిస్తోంది.
అవతారుని సమగ్ర జీవితచరిత్ర, ఎనిమిది సంపుటాలలో,
ఐదువేల పేజీలలో అత్యంత సరళమైన మధురమైన ఇంగ్లీషులో రాసిన
ఈ గ్రంథం ప్రతిఒక్కరూ చదవాలి.
ప్రతి బాబా ప్రేమికుని ఇంట్లో ఈ పుస్తకాలు ఉండటం ఎంతో అవసరం.
పద్యరూపంలో హిందీలోని మెహెర్‌దర్శన్,
తెలుగులో **"మెహెర్‌దర్శన్"** పేరిటనే Dr. MBVIR శర్మ-
'ద్విపదలో' అనువదించారు. శ్రీ దశిక ప్రసాదరావు, మెహెర్‌బాబా పత్రిక
వ్యవస్థాపకులు ఈ గ్రంథాన్ని ప్రచురించి- బాబా ప్రేమికులందరికీ అందజేశారు.
ñIt was His wish that I write it
and by doing so,
I have fulfilled His last orders to meò
అని భావూ బాబా ఎడల తన విధేయత ప్రకటించారు.
జనవరి 29 నాటికి బాబాకు Jolts – ఈడ్పులు వంటి వాటితో తీవ్ర బాధపడ్డారు.
ఈ సమయంలో జనవరి 30న బాబా తన మండలి సభ్యుడు,
అవతారునికి అత్యంత సన్నిహితుడైన ఏరుచ్‌ని పిలిపించి,
మెహెరాబాద్‌లో వుంటున్న బాబా మండలి సభ్యులు పాద్రీ, ఛగన్‌లను
మెహెరాజాద్‌కు (బాబా నివాసముంటున్న ప్రాంతం)

ఏడు రోజులు ఇక్కడ వుండేలా వారిని రమ్మనమని కబురు పంపమన్నారు.
ఈ కబురు అందగానే పాద్రీ మెహెరాజాద్‌కు వచ్చాడు.
పాద్రీ మెహెరాజాద్‌కు వెళ్ళాక, మెహెరాబాద్‌లో వుంటున్న
మహ్మద్ మస్తు స్థానిక బాబా ప్రేమికుడు– 'సిద్దూ'ని పిలిచి
పాద్రీ గురించి వాకబు చేశాడు.
సిద్దూ జరిగిన విషయమంతా క్లుప్తంగా మహ్మద్ మస్తుతో చెప్పాడు.
ఈ మాటలు విన్న మస్తు,
పాద్రీ రేపటికల్లా తిరిగి వస్తాడులే! అని అన్నాడు.
**'దాదా'** (బాబా) కూడా రేపు ఇక్కడకు వస్తున్నాడు.
గుస్తాద్‌జీలో (ఆయన 1958లో మరణించాడు) కలుస్తున్నాడని
చాలా స్పష్టంగా మహ్మద్ మస్తు సిద్దూతో అన్నాడు.
మహ్మద్ మస్తు మాటలు సాధారణంగా అందరికీ అర్థంకావు.
అలాంటిది, ఈ నాలుగు మాటలు మాత్రం మహ్మద్‌మస్తు
చాలా సుస్పష్టంగా పలికాడని సిద్దూ పేర్కొన్నాడు.

## Remember this I am not this body:

ఎప్పటిలాగా 1969 జనవరి 30న
భావూజీ రాత్రి కాపలాదారునిగా బాబా సమక్షంలో వున్నారు.
అప్పుడు సమయం రాత్రి 9.15 నిముషాలు.
బాబా చాలా ఆనందంగా కనిపించారు.
ఆరోగ్యంగానూ అగుపించారు.
బాబా భావూజీతో సంజ్ఞలు చేస్తూ ఇది గుర్తుంచుకోండి!!
నేను ఈ శరీరాన్ని కాదు.
ñRemember this -- I am not this bodyò – అని ప్రకటించారు.
అనంతరం – మండలి ప్రేమికుడు అలోబా తన డ్యూటీకై వచ్చాడు.
నీవు వెళ్ళి విశ్రాంతి తీసుకో అని బాబా భావూతో అన్నారు.
ఐతే, ఒక గంట తర్వాత తిరిగి బాబా, భావూజీని పిలిపించారు.
**ఈ సమయంలో భావూజీతో బాబా కేవలం రెండు మాటలు మాట్లాడారు.**
**याद रक** – గుర్తుంచుకో!!
**I am not this body**
నేను ఈ శరీరాన్ని కాదు.
నేను భగవంతుడిని అని స్పష్టంగా ప్రకటించారు.
ఇలా మాతో బాబా చాలాసార్లు అన్నారు.

కానీ ఈ దఫా బాబా

**याद रख – I am not this body**

అన్న మాటలు, నా హృదయానికి తాకేలా,

బాబా తన సంజ్ఞలతోకాక, తన గొంతుతో చాలా స్పష్టంగా అన్నారని,

భావూజీ ఆనాటి రాత్రి మాటలు తన జ్ఞాపకాలుగా చెప్పారు.

**“Although Baba’s voice was feeble,” Bhau recalled,**
**“the sound was audible and clear,**
**and its intensity and impact very, very forceful.**
**It conveyed so great an impression,**
**that my mind itself neither registered**
**nor questioned the fact that Baba was speaking”**
**“Yes- Baba is not the body” – I said**
**“ Don’t be anxious” Baba gestured.**
**Don’t worry about me.**
**Go to sleep.**

బాబా గొంతు చాలా నీరసంగా వుంది.

కానీ చాలా స్పష్టంగా నా చెవులకు బాబా మాటలు వినపడినాయి.

నేను కూడా వినయంగా అవును బాబా- నీవు భగవంతుడివి.

ఈ శరీరధారివి మాత్రం కాదన్నాను. ఆందోళన చెందవద్దు.

నా గురించి ఆలోచించకండి. వెళ్ళి నిదురపో-అని తిరిగి బాబా సంజ్ఞలతో తనకు సూచించారని భావూ అన్నారు. జనవరి 30న బాబా సుమారు నాలుగు గంటలు బాగానే విశ్రాంతి తీసుకున్నారు. ఈడ్పులయితే తరచు తీవ్రంగానే వచ్చాయి.

మరో ఏడురోజుల తర్వాత నేను నూరు శాతం బాగవుతాను.

ఇక ఆపై ఈ బాధలు నాకుండవు అని బాబా ఏరుచ్‌తో అన్నారు.

జనవరి 31 ఉదయం 7 గంటలకు బాబా పురుష మండలందరినీ బ్రేక్‌ఫాస్ట్‌కు వెళ్ళమని చెప్పారు. స్త్రీ మండలి మెహెరా- మణి- తదితరులందరూ బాబా సమక్షంలో వున్నారు. బాబాని అమితంగా ప్రేమించే- స్త్రీ మండలిలోని మెహెరా కానీ, వైద్యులు కానీ, బాబాకు దగ్గరగా వుంటే ఆ క్షణంలో బాబాకు ఎలాంటి ఆరోగ్య సమస్య వుండేది కాదు. అదే ఆ రోజూ జరిగింది. స్త్రీ మండలి సభ్యులు బాబా గదిని శుభ్రం చేశారు. అనంతరం, 8 గంటల సమయంలో బాబా తన దగ్గరకి మండలి వారినందరినీ పిలిపించారు. బాబా వారందరితో ముచ్చటించారు.

Goher is not responsible for my health.

Remember this that, I am God, అని సంజ్ఞలతో మండలి వారిని హెచ్చరించారు.

ఆ తర్వాత, తిరిగి తీవ్రమైన ఈడ్పులు వచ్చాయి.

డా॥ గోహెర్ ఇంజక్షన్‌లు యివ్వబోతుంటే, బాబా ఆమెను వారిస్తూ,
నేను భగంతుడినన్న సంగతి మరచిపోవద్దన్నారు.
పాద్రీ హోమియో పిల్స్ ఇచ్చాడు.
పూణేలో వుంటున్న ప్రముఖ వైద్యనిపుణులు డా॥ గిండే కోసం కబురు పంపారు.
కానీ, ఆయన సమయానికి రాలేదు. డా॥ గిండే వచ్చాడా?
అని బాబా తరచు అడిగారు. మధ్యాహ్నం 12 సమయంలో వచ్చిన తీవ్రమైన ఈడ్పులు
బాబాను కుదిపివేశాయి. దాంతో ఆయన శ్వాస స్తంభించింది.
ఆ తర్వాత 12.40 నిముషాలకు అహ్మద్‌నగర్ నుంచి బాబా కార్యదర్శి ఆదీ.కె.ఇరానీ,
డా॥ గిండే ఇద్దరూ వచ్చారు. అనేక దఫాలు చర్చలు జరిపాక,
మండలి సభ్యులందరూ మెహెరుడ్ని మెహెరాబాద్‌కు
ఆయన ముందుగా నిర్మించుకున్న సమాధి ప్రాంగణానికి తీసుకెళ్ళాలని నిర్ణయించారు.
ఈ మేరకు బాబా ప్రేమికులందరికీ టెలిగ్రాంలు పంపారు.
పలు దినపత్రికలు ఈ వార్తను విస్తృతంగా ప్రచురించాయి.
ఆకాశవాణి, బిబిసి ప్రసార మాధ్యమాలు కూడా
తమ వార్తలలో బాబా భౌతిక దేహత్యాగం గురించి ప్రసారం చేశాయి.
సాధారణంగా మానవ మృతదేహాన్ని,
శ్వాస ఆగిన తర్వాత కనీసం 20 గంటల్లో సమాధి లేదా ఖననం చేయాలి.
ఈ విషయమే ప్రముఖ వైద్యులు డా॥ గిండే ప్రస్తావిస్తూ,
ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు
బాబాను సమాధిలో వుంచాలన్నారు.
ఐతే, బాబా ఆఖరి దర్శనం కోసం దేశం నలుమూలల నుండి
ఎందరో ప్రేమికులు వస్తున్నామని,
అప్పటిదాకా వేచి వుండాలని,
అనేక విజ్ఞప్తులు ట్రస్టువారికి అందాయి.
అలాగే, ఎందరో విదేశీయులు సయితం తాము బయల్దేరామని,
తాము వచ్చేదాకా సమాధి కార్యక్రమాన్ని వాయిదా వెయ్యాల్సిందిగా అభ్యర్థనలు
కోకొల్లలుగా వచ్చాయి. మెహెరాబాద్‌లో డా॥ గిండే మాత్రం
ఈ వాయిదా విషయంలో సముఖంగా లేరు.
ఎందరో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి
ఆనాడు అవతారుని దివ్యదర్శనం పొందారు.
ప్రభుత్వ ఆఫీసుల్లో పనిచేసేవారు,
సెలవలు వుండీ లేక తగిన అనుమతి తీసుకోకుండా

కట్టుబట్టలతో హుటాహుటిని మెహెరాబాద్ చేరిన వారెందరో!!
జనవరి నెలలో మెహెరాబాద్‌లో విపరీతమైన చలి.
ఉన్ని దుస్తులు వాడకం తక్కువగా వుండే తెలుగు ప్రాంతీయుల
బాధ వర్ణణాతీతం.
విశాఖ నివాసి శ్రీ త్రినాథ్ రథో గారి విషయానికి వస్తే,
ఆయన తరచు చెప్తుంటారు.
బాబా కబురు తెలియగానే
తాము చిన్నకారు నొకదాన్ని మాట్లాడుకుని
మెహెరాబాద్‌కు ప్రయాణమయ్యారన్నారు.
ఐదుగురు ప్రయాణించగల కారది.
బాబా ప్రేమికులు మరొకరు తాను కూడా వస్తానన్నారు.
ఎవరో ఒకర్ని తగ్గించాలి కదా!
దాంతో శ్రీ రథో తన భార్యను నిలిపివేసి, బాబా ప్రేమికునికి స్థానం కల్పించామన్నారు.
ఇదొక రకంగా, బాబా ప్రేమలో త్యాగం అన్నా అతిశయోక్తి కాదన్నారు.
అందరూ మెహెరాబాద్ చేరాం. బాబా దర్శనం చేసుకున్నాక
ఒంటిపైన దుస్తులు మార్చాలని సూట్‌కేస్ తెరిస్తే శ్రీమతి రథో గారి చీరలున్నాయి.
ఆఖరి నిముషపు ప్రయాణపు తొందరలో తెలియక పెట్టెలు మారాయి.
ఆవిడ చీరలతోనే చలికి తట్టుకున్నానని, ఇదీ అవతారుని దివ్యలీలగా భావించానని
శ్రీ త్రినాధ రథో నాటి తన అనుభవాన్ని చెప్పడం మాకింకా గుర్తుంది. చిన్న విషయాల్లో
కూడా అవతారుని దివ్యలీలను బాబా ప్రేమికులు గమనించాలి.
తన ప్రేమికులందర్నీ అవతారుడు కంటికి రెప్పలా కాపాడతారనడంలో సందేహం
లేదు. ఈ విషయంలో ఆయన భక్తులకు గల అనుభవాలు ఎన్నో.
ఇలా ఆనాడు హుటాహుటిన మెహెరాబాద్‌కు బయల్దేరిన వారి సంఖ్య
అసంఖ్యాకం అనొచ్చు. ఐతే, డా॥ గిండే, ఫ్రాన్సిస్ బ్రాబజాన్‌లు
త్వరగా బాబా సమాధి కార్యక్రమం ముగించాలని గట్టిగా పట్టుపడుతున్నారు.
అంతే పట్టుదలతో మరికొందరు బాబా మండలి సభ్యులు దూర ప్రాంతాలనుంచి
విచ్చేసే బాబా ప్రేమికులకోసం కొంతసేపు నిరీక్షించాలని పట్టపట్టారు.
ఏదైతేనేమి వీరి విజ్ఞప్తి చివరాఖరకు అంగీకరించడమైంది.
బాబా ముందుగా ప్రకటించినట్లు I will give darshan lying down
అన్న మాటలకు అర్థం మండలి వారికి, బాబా ప్రేమికులకు ఆనాడు అర్థమయింది.
ఫిబ్రవరి ఒకటో తేదీన బాబా సమాధి కార్యక్రమం నిర్వహించాలనుకున్నా
ఏరోజు కారోజు వాయిదా వేస్తూ అవతారుడి భక్తుల కోసం,

ఆయన ఆఖరి భౌతిక దివ్య దర్శనం కోసం
ఏడురోజుల పాటు ఉంచారు. వైద్యులు ఆందోళన చెందినట్లు
అవతారుని దేహంలో ఏడు రోజులలో ఎలాంటి మార్పు కనపడ లేదు.
బాబా దేహం చుట్టూతా ఐసుగడ్డలుంచారు. ఆ ఐసుగడ్డలపై వరిపొట్టు చల్లారు.
మెహెర్‌బాబా పడుకుని దివ్య దర్శనం ఇస్తున్నట్లుగానే ఆనాటి దృశ్యం చూసిన వారు
చెప్తారు. మెహెరుడి వదనం ఎంతో ప్రశాంతంగా వుంది.
ఆయన ముఖ వర్చస్సు పచ్చని పసిడిగా కాంతులీనుతూ వుంది.
అవతారుని ఆఖరి దర్శనం పొందిన కొందరి అదృష్టవంతుల్లో
ఈ రచయిత కూడా వున్నాడు.
అప్పటికి నా వయస్సు పది సంవత్సరాలు.
ఆరవ తరగతి చదువుతున్నట్లు గుర్తు.
బాబాని సమాధిలో వుంచిన తర్వాత మూడవ రోజు నుంచి మొదలు ఏడవ రోజు
వరకూ మెహెరాబాద్‌లో బాబా సమాధి దగ్గర
మా తల్లిగారైన మల్లాది సుశీలాకృష్ణతో కల్సి ఉండే అవకాశం ఆనాడు అవతారుడు
కల్గించాడు. అవతారుని ఆ దివ్య మంగళ స్వరూపంలో ఏడవ రోజున కూడా ఎలాంటి
మార్పు రాలేదు. బాబావారి కడపటి భౌతిక దర్శనార్థం దేశం నలుమూలలనుంచి వచ్చే
వారి సంఖ్య వేలల్లో ఉంది. ఈ మాదిరిగా మెహెరాబాద్‌కు బాబా రాకతో
ఒక్కసారి అక్కడి గ్రామీణ వాతావరణంలో ఎంతో మార్పు వచ్చింది.
రోడ్డు ప్రక్కన పలు టీ స్టాళ్ళు వెలిసాయి.
ఆ ఏడు రోజుల్లోను అహ్మద్‌నగర్ వైపు వచ్చీ పోయే రైళ్ళన్నీ మెహెరాబాద్‌లో ఆగాయి.
అనేక ప్రాంతాల నుంచి వచ్చే బాబా ప్రేమికులను అక్కడ దించి,
వారికి అభివాదం చేసేలాగ గట్టి కూత పెట్టుకుంటూ రైళ్ళు ముందుకు సాగాయి.
అప్పట్లో మెహెరాబాద్‌లో కరెంటు లేదు. రాత్రిపూట పూర్ణచంద్రుని కాంతులతో
ప్రశాంతంగా ఆ పరిసరాలున్నాయి.
విజయవాడ ప్రేమికులు శ్రీ చింతా సర్వారావు, శ్రీ మాజేటి రామ్మోహనరావులు
బహుశా మూడోరోజుననుకుంటా మెహెరాబాద్‌లో అడుగిడుతూనే
అహ్మద్‌నగర్ నుండి పవర్ జనరేటర్ తెప్పించి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.
అనంతరం ప్రేమికుల సౌకర్యార్థం షామియానాల ఏర్పాటు జరిగింది.
వాటిల్లోనే బాబా భక్తులు భజనలు, కీర్తనలు హృదయాంతరాలలోని ఆర్తనాదాల్ని
ఆలాపనగా రాత్రీ- పగలు చేశారు. మొట్టమొదటిగా వచ్చిన విదేశీ ప్రేమికుడు
డాన్-ఇ-స్టీవెన్స్. ఆ తర్వాత హరికెన్మోర్, ఇలా పలువురు ఫిబ్రవరి 4 కల్లా
మెహెరాబాద్ బాబా సమాధి ప్రాంగణానికి చేరారు.

ఎంతో వేదనతో, ఆవేదనతో మెహెరాబాద్ చేరినవారు
కళ్ళనిండా నీళ్ళునింపుకుని అవతారుడ్ని దర్శించుకున్నారు.
అవతారుని దర్శనం చేసుకున్నాక కొందరు తెలియని ఆనందం అనుభవించారు.
మరి కొందరి రోదన అనంతంగానే వుంది.
ఆ ఏడ్రోజులూ వారి బాధ వర్ణణాతీతం.
మనస్తాపంతో స్పృహకోల్పోయిన వారూ ఉన్నారు.
ఆ ఏడురోజులలో బాబా దేహంలో ఎలాంటి మార్పు కనపడలేదు.
బాబా చాలా ప్రశాంతంగా నిదురపోతున్నట్లే అగుపించారు.
హరికెన్‌మోర్ బాబా ప్రార్థనలు ప్రతిరోజు ఉదయం 7 గంటలకు పఠించారు.
అలాగే, కేశవనారాయణ్ నిగం- మెహెర్ చాలీసా చదివారు.
బాబా ట్రస్టు విచ్చేసే ప్రేమికులకు కనీస సౌకర్యాలు కల్పించలేక పోతున్నామని,
అందుకు తామెంతో చింతిస్తున్నామన్నారు. అందుకు తమదే పూర్తి బాధ్యతగా
పేర్కొంటూ, బాబాని దర్శించుకున్న వారందరూ దయచేసి
వారి వారి స్వగ్రామాలకు తిరిగి వెళ్ళమని విజ్ఞప్తులు చేసారు.
ఐతే, ఎవరు వెళ్తారు.
బాబా సమాధి కార్యక్రమం పూర్తయ్యే వరకూ
ఎవరూ అక్కడ్నుంచి కదలడానికి సుతారామం సుముఖత చూపలేదు.
మెహెరుని దేహం decomposition అయ్యే పరిస్థితి ఉంటే
సమాధి కార్యక్రమం వెంటనే చేపడతామని, లేదంటే విచ్చేసే భక్తుల కోసం
సమాధి కార్యక్రమం వాయిదా వేస్తామని, డా॥ గోహెర్ పరీక్ష చేస్తున్నారని,
ఈ మేరకు ప్రతిరోజూ ట్రస్టు వారు మైకులో ప్రకటనలు చేసేవారు.
ముందుగా, బాబాని ఏడురోజులు అలా సమాధిలో ఉంచుతారని ఎవరూ
ఊహించలేదు. ఐతే, తమాషాగా అవతారుని భౌతిక దేహంలో ఎలాంటి మార్పులు
లేకపోవడంతో, దూర ప్రాంతాల నుంచి అనేక వ్యయప్రయాసలకోర్చి వస్తున్న
ప్రేమికుల కోసం, వారికి వీలుగా, బాబా సమాధిని ఏ రోజుకారోజు
వాయిదా వేస్తూ వచ్చారు.
"ఈ భౌతిక బాధలకు రాబోయే 7 రోజులలో తాను పూర్తిగా దూరమవుతానని
బాబా పలుమార్లు హెచ్చరించారు".
ఈ మాటలనే మండలి సభ్యులు బాబా సందేశంగా తీసుకుని
1969 ఫిబ్రవరి 7 శుక్రవారం మధ్యాహ్నం 12.15 నిముషాలకు
సమాధి కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు.
మరోవిశేషం, జొరాస్టరు క్యాలెండర్ ప్రకారం అవతారుని జన్మదినం

ఫిబ్రవరి 7 అయింది. ఫిబ్రవరి 7 ఉదయం 4.30 కల్లా అందరూ
బాబా సమాధిని చేరారు. సరిగ్గా ఐదు గంటలకు మండలి వారితో సహా
కొన్ని వేలమంది ఆ ప్రాంగణంలో వున్నారు.
“సచ్చిదానంద పరమానంద– మెహెర్‌బాబా విజ్ఞానంద”
నామ సంకీర్తన, నిరంతరంగా జరిగింది.
ఆ రోజున తెల్లవారేసరికే వేలాది భక్తులు సమాధి వద్ద క్యూలు కట్టారు.
కొందరికి రెండు నిముషాలపాటు సమాధిలో కూర్చునే అవకాశం
కూడా ట్రస్టు కల్పించింది. ఫిబ్రవరి 7 మధ్యాహ్నం 12.15 ని॥
బాబా సమాధి అవుతున్నారని స్థానిక దిన పత్రికలు ముందుగానే
విస్తృత ప్రచారం యిచ్చాయి. దాంతో దగ్గర్లోని ప్రజలు సయితం తండోపతండాలుగా
బాబా సమాధి ప్రాంగణానికి విచ్చేసారు.
మహ్మద్ మస్తుని కూడా బాబా దర్శనార్థం పాద్రి – సిద్దూలు స్వయంగా తీసుకొచ్చి
అవతారుని దర్శనం యిప్పించి,
తిరిగి ఆయన ఉండే గదికి తీసుకెళ్ళారు.
సరిగ్గా మ॥ 12 గం హరికెన్‌మోర్ పర్వద్విగార్, పశ్చాత్తాప ప్రార్థనలను
తన సహజ ధోరణిలో ఉద్వేగంగా– బిగ్గరగా చదివారు.
మ॥ 12.15 ని॥ బాబా సమాధి కార్యక్రమం ప్రారంభించారు.
అందరికీ అవతారుని సమాధిపై ‘మృత్తిక’ చల్లే అవకాశం కల్పించారు.
అనంతరం అవతారుని భౌతిక దర్శనభాగ్యం సాయంత్రం 5 గంటలకు
పూర్తిగా దూరమయింది. ఏడు రంగుల అవతారుని పతాకాన్ని
బాబాని సమాధి చేసిన ప్రాంతంలో కప్పారు.
అనంతరం, బాబా స్త్రీ మండలి పుష్పగుచ్చాలు వుంచారు.
ఆ పిదప బరువైన హృదయాలతో బాబా ప్రేమికులు
మెహెరాబాద్ నుంచి తమ స్వస్థలాలకు తిరిగి వెళ్ళారు.
నాటినుండీ ప్రతి ఏటా జనవరి 31న అవతారుని అమరతిథి
బాబా ప్రేమికులు ఘనంగా జరుపుకుంటున్నారు. పవిత్ర అమరతిథిలో పాల్గొనేందుకు
వేలాది బాబా ప్రేమికులు మెహెరాబాద్‌కు తరలి వెళ్తున్నారు.
అలా మెహెరాబాద్‌కు వెళ్ళే వారందరూ, మెహెరాబాద్‌లో బాబా సమాధిని
దర్శించుకుని, మెహెర్‌బాబాని తమ మనస్సునిండా నింపుకుని
నేరుగా మీ ఇళ్ళకు వెళ్ళవల్సింది. ఇది ఒక ముఖ్యమైన సూచన.
ఇది అవతార్ మెహెర్‌బాబా తన ప్రేమికులకిచ్చిన ఆదేశం!!

# మహారాష్ట్ర రాజభవన్‌లో





బాబా ట్రస్టు సభ్యులు, మెహెర్‌నాథ్ కల్చూరీ, కరీంనగర్ జిల్లా బాబా ప్రేమికులు శ్రీ దుగ్యాల ప్రభాకర్, శ్రీ యన్. లక్ష్మీ నరసింహారావు, తదితరులు మహారాష్ట్ర గవర్నరు శ్రీ సి.హెచ్. విద్యాసాగర్‌రావుని ముంబాయిలోని రాజభవన్‌లో కలిసి మెహెరాబాద్‌లో జనవరి 31న, అవతారుని 46వ అమరతిథిలో పాల్గొనవల్సిందిగా ఆహ్వానించారు.

## కైలాస్‌గిరిని సందర్శించిన ముఖ్యమంత్రి

విశాఖపట్నంలోని కైలాస్‌గిరి బాబా సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు తన సహచర మంత్రులతో కలిసి నవంబరు 17న సందర్శించారు. బాబా చిత్రపటానికి ముఖ్యమంత్రి ఆరతి ఇచ్చారు. అనంతరం బాబా ప్రసాదాన్ని, సాహిత్యాన్ని శ్రీ మాలిన సత్యనారాయణ తదితరులు అందజేసారు.

## అనకాపల్లి కేంద్రం రజతోత్సవ వేడుకలు

అవతార్ మెహెర్‌బాబా అనకాపల్లి కేంద్రం రజతోత్సవ వేడుకలు 20.12.2014 శనివారం సాయంత్రం 4 గంటల నుండి 21.12.2014 ఆదివారం సా. 5 గంటల వరకు "మెహెర్ ప్రేమిక సహవాస్" ఏర్పాటుచేసినట్లు ఆహ్వానం పంపారు.

## ఏలూరు సెంటరు వార్షికోత్సవం

పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు సెంటరు 62వ వార్షికోత్సవ సందర్భంగా **2014 డిశంబరు 25 ఉదయం 7 నుండి 1.30 దాకా** ప్రత్యేక సహవాస్ కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు కార్యదర్శి శ్రీ యు. బాపిరాజు **(93983-24096)** ఒక ప్రకటనలో తెలిపారు.

# నిజామాబాద్ సహవాస్

నిజామాబాద్ సెంటర్ వార్షికోత్సవం సందర్భంగా, డిసెంబరు 25, 2014, ఉ. 9 నుండి సా. 5 వరకు బాబా సహవాస్ ఏర్పాటు చేసినట్లు శ్రీ ఎ. జనార్ధనరావు (9908785774) ఒక ప్రకటనలో తెలిపారు.

# విశాఖ మహిళా సహవాస్

2014 నవంబరు 30న విశాఖపట్నంలో మెహెర్ మహిళా ప్రేమిక సహవాస్ నిర్వహించారు. విశాఖతోపాటు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం తదితర బాబా సెంటర్‌ల నుండి బాబా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. డా॥ సి. హెచ్. ఉషారాణి, శ్రీమతి ఎన్. రాధమ్మ, శ్రీమతి హెచ్. మహేశ్వరీదేవి, శ్రీమతి ఎ.ఎస్.కె. మహాలక్ష్మి, శ్రీమతి టి. శ్యామల, శ్రీమతి వాసవి తదితరులు బాబా సందేశాలపై ప్రసంగించారు.

# వివాహం

శ్రీ రావుల రాధాకృష్ణ, శ్రీమతి అరుణ కుమారి గార్ల కుమారుడు చి॥ సాయికృష్ణ వివాహం చి॥ల॥సౌ॥ శ్రీఅమృత విద్యతో 6.12.2014 శనివారం రాత్రి గం. 10.44 ని.లకు ఆంధ్రకేసరి కళాక్షేత్రము, విశాఖపట్నం నందు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

# వివాహం

శ్రీ కోరుకొండ మహేష్ కుమార్, శ్రీమతి రాధిక గార్ల కుమార్తె చి॥ సౌ॥ మెహెర్ దీపిక వివాహం చి॥ శ్రావణ్ సూర్య కుమార్‌తో 07.12.2014 ఆదివారం ఉదయం 8.32 నిముషములకు రాజమండ్రిలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

# మెహెర్ ప్రేమిక సహవాస్

అవతార్ మెహెర్‌బాబా పార్వతీపురం కేంద్రంలో మెహెర్ ప్రేమిక సహవాస్ 28.12.2014 ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# Discovering the Avataric Treasure

2015 ఫిబ్రవరి 13, 14 తేదీలలో మెహెరాబాద్‌లో రెండ్రోజుల సహవాస్ ఏర్పాటు చేసినట్లు ఛైర్మన్, మెహెర్‌బాబా ట్రస్టు, శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం 2014 సెప్టెంబరు మెహెర్‌బాబా సంచికను దయచేసి చూడగలరు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - *తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ***

***(గత సంచిక తరువాయి)***

ఒకప్పుడు బాబావారు ఛగన్‌గారిని ఆటపట్టించేవారు. చీటికి మాటికి చిరాకు పడేవారు. విసుక్కొనేవారు. అతగాడు ఏం చేసినా, అబ్బే, బాగా లేదు అంటూ పెదవి విరిచేవారు. ఒక్కోసారి బాబావారి మాటలు తూటాల్లాగ తగిలేవి. నేనేం పాపం చేశాను బాబావారికి నాపైన కోపం వస్తోంది మాటిమాటికీ అని బాధపడేవాడు ఛగన్‌గారు. ఒక్కోసారి ఉక్రోషం పట్టలేక భోరుమని ఏడ్చేవాడు.
మూటాముల్లే సర్దుకుని పోదామని కూడా అనుకొనేవాడు.
బాబావారు తనపై చూపిస్తున్నది ఆగ్రహం కాదనీ, తన సంస్కారాలని తుడిచిపెట్టి ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు తీసుకువెళ్ళటానికేననీ తెలుసు.
కానీ మనిషి కదా! చీమూ నెత్తురూ వున్న ప్రాణం కదా,
తట్టుకోలేకపోయేవాడు బాబావారి అదిలింపులకి.
ఇప్పుడు పాద్రీ గారి పనీ అలానే వుంది. ఆజానుబాహుడు. అందగాడు అనలేము కాని, కురూపి మాత్రం కాదు. తండ్రి డ్రైవరు. తనూ డ్రైవరే, తండ్రి రైలు నడిపేవాడు. తను ఇదిగో బాబావారి కోసం బస్సు, లారీ, ట్రాక్టరు ఏది అంటే అది నడుపుతున్నాడు. ఎంత జాగ్రత్తగా నడిపినా బాబావారు అక్షింతలు వేస్తున్నారు.
ఏమిటి ఆ నడపడం, ఎడ్ల బండిలా నెమ్మదిగా పోతున్నావే.
స్పీడుగా నడుపు అని అంటున్నారు. రోడ్డు బాగా వుంటేనే కదా బస్సు స్పీడుగా వేళ్ళేది. మన రోడ్ల సంగతి మీకు తెలియదా, గుంటలు లేని రోడ్లు ఇప్పుడూ లేవు, అప్పుడూ లేవు. గతుకుల్లో పడితే ఎత్తి కుదేసినంత అవుతుంది. బాబావారికి ఇబ్బంది అవుతుంది. అందుకని కొంచెం నెమ్మదిగా బస్సు నడుపుతున్నమాట మాత్రం వాస్తవం. బాబావారిదేమీ పట్టించుకోనేవారు కాదు. నేను స్పీడుగా పోనీమన్నాను, నీవ్వు స్పీడుగా పోవడం లేదు అని నిలదీసేవారు. ఒకరోజున వుండబట్టలేక పాద్రీ మనస్సులో మాట చెప్పాడు. మనం వెళ్తున్న రోడ్డు బాగాలేదు బాబా!
అన్నీ గతుకలే, అందుకనే కొంచెం నెమ్మదిగా నడుపుతున్నానన్నాడు.
అంతే బాబావారు కస్సున లేచారు. నిప్పులు చెరిగారు.

నాకంటే నీకు ఎక్కువ తెలుసా! అని హుంకరించారు.
నేను చెప్పినట్లు చేయాలని తెలిదా అని నిలదీశారు.
పాపం పాద్రీ ఏమంటాడు. బాబావారిమాట ప్రకారం నడుచుకోవాలని అతనికి తెలీకపోతే కదా. బాబావారి మాటకి ఎదురు చెప్పకూడదనీ తెలుసు. కానీ రోడ్డు బాగా లేదే! స్పీడు పెంచినా, గతుకుల్లో పడితే ఏమో ఏమవుతుంది? యాక్సిడెంట్ అయితే, అమ్మో! అప్పుడు నన్నే అందరూ తిట్టరు!
ఇది పాద్రీ మనోగతం. అతని మనస్సు బాబావారికి తెలీదా!
తెలుసు. కానీ అదొక పరీక్ష. మహానుభావుడు పాద్రీ గారు ఎన్ని పరీక్షలకి తట్టుకొని నిలబడ్డాడో! సరే అది వేరే సంగతి. వర్తమానానికి వస్తే, బాబావారి చివాట్లు తప్పటం లేదు. చివరికి ఏమన్నారో తెలుసా! నీకు డ్రైవింగ్ ఎవరు నేర్పారని అడిగారు. మీ నాన్న బస్సు నడిపాడా ఎప్పుడైనా అని ప్రశ్నించారు. ఇలా బాబావారు ప్రశ్నిస్తారని ఊహించని మన పాద్రీ గారు అవాక్కయ్యాడు. అదేమిటి బాబా అలా అడుగుతారు, మా నాన్నకి డ్రైవింగ్ వచ్చు. ఆయన బస్సులు నడిపాడు. ఇప్పుడు రైళ్ళు నడుపుతున్నాడు. ఆయన వారసత్వం నాకు వచ్చింది. కాబట్టే నేను డ్రైవరునయ్యాను. మీకు తెలుసు కదా ఈ సంగతి అన్నాడు. బాబావారు అతని మాటలని పట్టించుకోలేదు సరికదా, మరింతగా ... మెత్తారు. నువ్వు మనిషివి కాదు, పశువన్నారు. చూడటానికి జిరాఫీలా వున్నావన్నారు. తాడిచెట్టులా ఎదిగావు. కానీ బుద్ధి రాలేదన్నారు. చిన్నంతరం, పెద్దంతరం లేకుండా పోయింది నీకు. నా మాటల్నే ఖాతరు చేయటంలేదన్నారు. బాబావారికి ఇంతగా కోపం ఎందుకువచ్చిందో అర్థం కాలేదు మండలివారికి. బాబావారి కోపానికి పాద్రీ బలవుతుంటే, పాపం జాలివేసింది. కానీ ఏంచేస్తారు. జోక్యం చేసుకొనే ధైర్యం ఎవరికీ లేదు. బాబావారికి కోపం ఊరికే రాదు కదా! ఇవాళ్ళ కూడా ఏదో కారణం వుండి వుంటుంది అని సర్దిపెట్టుకున్నారు. మరి పాద్రీ గారి సంగతికి వస్తే, సహనంగా భరిస్తున్నాడు బాబావారు పెడుతున్న రంపపు కోత. కానీ ఎంతసేపని. ఎవరయినా కొంతసేపే కదా ఓపిక పట్టగలిగేది. అదే జరిగింది మన మిత్రుని విషయంలో. ఇహ నావల్ల కాదయ్యా భరించడం అన్నాడు. బస్సు ఆపేశాడు. శలవ్! బాబా! నా దారిన నేపోతానంటూ లేచి నిలబడ్డాడు. అప్పుడు ఏమయిందో తెలుసా పాఠకమహాశయా! ఊహించగలరా ఏమయిందో! ఏమయిందంటే, రౌద్రాకారంలో వున్న బాబావారు శాంతమూర్తి అయ్యారు. ఎక్కడికి పోతావ్? కూర్చో బుద్ధిగా అన్నారు. కాలు కదిపావో జాగ్రత్త! ఒళ్ళు హూనం చేస్తా. కాళ్ళు చేతులు కట్టిపడేసి మరీ చితకబాదుతా! పోతాడట! ఎక్కడికి పోతావు కూర్చో! ఇక్కడే మూర్ఖుడా! అన్నారు. అప్పుడు చూడాలి

పాద్రీ గారిని. ఉక్రోషంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న వాడిలా నోరు వెళ్ళబట్టాడు.
ఇప్పటిదాకా తిట్ల వర్షం. ఇప్పుడు ప్రేమ వర్షం. బాబావారితో ఇంతే ఎప్పుడూ!
ఏమో నేను మూర్ఖుడి నేమో! నిజంగా! అందుకే బాబావారు కాస్త మోతాదు పెంచారివాళ,
అనుకొన్నాడు. బాబావారికేసి తేరిపారా చూశాడు. స్టీరింగ్ పుచ్చుకున్నాడు మళ్ళీ.
బజారుకు పోనీ, అన్నారు బాబా. మార్కెట్టుకి వెళ్ళాక బస్సుని
టీ హోటలు ముందు ఆపమన్నారు. అందరూ బిలబిలా బస్సు దిగారు.
టీ కి ఆర్డరు ఇచ్చారు. వేడివేడి టీ పట్టుకువచ్చాడు సర్వరు.
నాకు వద్దన్నాడు పాద్రీ. ఇంత అవమానం పాలయ్యాక
ఇంకా ఈ వేడి నీళ్ళు ఎందుకు నాకు అనుకున్నాడులా వుంది.
నాకు టీ వద్దు, పట్టుకుపో అన్నాడు. సర్వరు కప్పుని వెనక్కి పట్టుకుపోబోతుంటే,
ఇలా ఇవ్వు అని కప్పుని తీసుకొన్నారు బాబా. ఇలా రా అంటూ పాద్రీని
తన వైపుకి లాక్కొని "వూ! త్రాగు" అంటూ టీ కప్పుని చేతిలో పెట్టారు.
ప్రభువు ఆజ్ఞ అది. అంతే పాద్రీగారు టీ నోటిలో పోసుకొన్నారు.
ఇలా టీ ప్రహసనం ముగిశాక, మళ్ళీ మొదలయింది చర్చ.
ఎక్కడికి పోదామంటారు అని బాబావారే చర్చకి నాందీ ప్రస్తానం చేశారు.
కాసేపు తర్జన భర్జన అయ్యాక, ఈ వేళ్టికి **'యవలా'** వెడదామని నిర్ణయించారు.
**'మన్మాడ్'కి** ప్రక్కనే వున్న ఈ ఊరు చేనేతదారులకి ప్రసిద్ధి అప్పుడూ, ఇప్పుడు.
యవలా చేరేసరికి చీకటి పడింది. ఊరంతా చుట్టుముట్టి వచ్చారు.
ఆ వేళ బస చెట్టు క్రిందనే. తెల్లవారుతూనే, ఔరంగాబాద్‌కి బయలుదేరారు.
దారిలో ఎల్లోరా గుహలు దర్శనమిచ్చాయి. అప్పటికి మధ్యాహ్నం మూడయింది.
ఓ గుహలో బాబావారు ఓ 15 నిముషాలు కూర్చున్నారు.
మరి ఆ ఏకాంతవాసం ఎందుకనో ఏమిటో చరిత్రకారుడికే తెలియాలి.
బాబావారు వివరించ లేదు. గుహ నుంచి వస్తూనే, వేళయింది పోదామా అన్నారు.
అందరూ బస్సు ఎక్కారు. ఏ ఊరుకి బాబా అని అడిగారు పాద్రీ.
ఔరంగాబాద్ దగ్గరే ఇక్కడికి, అక్కడికే కదా! అన్నాడు. ఔరంగాబాదు వద్దు.
**'జాల్నా'** కేసి పోనీ అన్నారు బాబా. ఊళ్ళోకి ప్రవేశిస్తుంటే ఓ చక్కని పళ్ళ తోట
కనిపించింది. బాబాబారు కాసేపు విశ్రాంతి తీసుకొన్నారక్కడ.
పండరీపూర్‌కి వెడదామన్నారు. అక్కడికి మీరు వెళ్ళలేరు అన్నారు స్థానికులు.
రోడ్డు బాగాలేదు. మధ్యలో నది అడ్డం వస్తుంది. బస్సు నదిని దాటడం కష్టం
అన్నారు. వర్షాకాలం కదా మరి. అలా అయితే ఔరంగాబాద్‌కి పోదామన్నారు
బాబా! ఔరంగాబాద్ చేరేసరికి చీకటి పడింది. ఊళ్ళోకి వెళ్ళలేదు.
రోడ్డు ప్రక్కనే బస్సు ఆపాడు పాద్రీ. రోడ్డుకి అటూ ఇటూ చెట్లు వున్నాయి.

బాగుంది ఇక్కడ అంటూ ఓ చెట్టు క్రింద బస్సుని నిలిపాడు.
వర్షాలు బాగా పడ్డాయేమో, ఆప్రాంతం అంతా బురద బురదగా వుంది.
కానీ ఇక్కడే మన బస అన్నారు బాబా. పాపం మండలివారు ఎదురు చెప్పలేదు.
ఆ రాత్రి వారికి జాగారమే అయింది. బాబావారు పడుకొంటే,
రాత్రి కాపలాకి ఎవరో ఒకరు వుంటారు కదా, ఆ డ్యూటీ ఆవాళ ఛాన్జీ గారిది.
ఆ ప్రకారంగా ఆగస్టు 24వ తేదీకి తెరపడింది.
మర్నాడు అంటే ఆగస్టు 25వ తేదీన మళ్ళీ చర్చ మొదలయింది.
ఇప్పుడు ఎక్కడికి వెళదామని. ఎవరికి తోచిన సలహా వాళ్ళిచ్చారు.
ఎన్నో ఊళ్ళ పేర్లు మాటల మధ్య దొర్లాయి. అయితే నాసిక్ వైపే అందరూ
మొగ్గు చూపారు. సరే ఇంకేముంది పాడ్రీ రథం కదిలింది.
గోదావరి నది ఒడ్డున వున్న నాసిక్ నగరం చేరేసరికి రాత్రి తొమ్మిది కొట్టింది.
ఈ వేళతో ఆఘూ ఆలీ, ఆలీ అక్బర్ అబ్దుల్లాల యాత్రకీ తెరపడింది.
ఇది ఎవరూ ఊహించ లేదు. ముగ్గురు కుర్రాళ్ళు బాబావారితోనే
వుంటారనుకొంటున్నవారికి ఆశ్చర్యం వేసింది. ఏం పాపం చేశారీ చిన్నారులనుకొన్నారు
ఆ పెద్దలు. కానీ పాఠకులకి తెలుసుగా. బాబావారి కొన్ని నిర్ణయాలకి తిరుగు
వుండదు. ఈ ముగ్గురినీ క్వెట్టా పంపిస్తున్నానన్నారు.
రావ్‌సాహెబ్ తోడు వెడతాడన్నారు. ప్రయాణానికి ముహూర్తం పెట్టారు.
అది ఎప్పుడో కాదు. రేపేనన్నారు. అలా 26వ తేదీన ఆలీ, అక్బరు, అబ్దుల్లా, రైలు
ఎక్కారు. రావ్‌సాహెబ్‌తోపాటు నాసిక్ నుండి బొంబాయి, అక్కడి నుండి కరాచీ
మీదుగా క్వెట్టా, బాబావారు నాసిక్ స్టేషన్‌కి వచ్చారు.
రైలు కదిలేవరకూ వాళ్ళతోనే వున్నారు. వాళ్ళని దగ్గరకి తీసుకొన్నారు. ముద్దాడారు.
ఆ చిన్నారులు బాబాకి అతుక్కుపోయారు. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరుగుతున్నాయి.
కానీ బింకంగా వున్నారు. శివాజ్ఞని శిరసావహిస్తున్నాము తప్ప మా తప్పేమీ
లేదన్నట్లుంది వాళ్ళని చూస్తుంటే. ఆ దృశ్యం కలిచివేసింది మండలివారిని, చూపరులని
కూడా. అందరి కళ్ళు చెమ్మగిల్లాయి. నావిక, ఎక్కడికోయి నీ పయనం అంటూ రైలు
కదిలింది. భారమైన మనస్సుతో అందరూ వెనక్కి తిరిగివచ్చారు.
అప్పుడు బాబావారు ఓ మాట చెప్పారు. పిల్లల మూగ వేదన నాకు తెలుసు,
అయినా వాళ్ళని పంపేయడం వాళ్ళ మంచి కోసమే అన్నారు.
అఘూ అలీని దగ్గరగా కూర్చొపెట్టుకునేవాడిని రాత్రి, పగలు.
ఒకరోజా, రెండు రోజులా, చాలా రోజులుగా కూర్చొంటున్నాడు
వాడు నాకు అతి దగ్గరగా. ఈ వేళ ఏమో వాడిని కొన్ని వేల మైళ్ళ దూరం పంపించేసేను.
అయ్యో, ఎలా వున్నాడో అనిపిస్తోంది. నా లీల గమ్మత్తుగా వుంటుంది కదూ.

నిన్న దగ్గర కూర్చొన్నాడు. ఈ వేళ దూరం పంపాను.
అయినా వాడి గురించి అయ్యో పాపం అంటున్నాను.
ఎందుకో తెలుసా? ఎందుకంటే, ఆఘూ ఆలీ నన్ను వదిలి వుండలేడు.
ఈ ఎడబాటుని భరించలేడు అందుకని.
వాడు పడుతున్న క్షోభ బాణంలా వచ్చి గుచ్చుతోంది నాపైన.
ఆ బాణాలు నన్ను గుచ్చుకొని నెప్పిపెడుతున్నాయి అప్పుడే ....అన్నారు.
**వసంత్ గురించి** ప్రస్తావించారు. ప్రేమాశ్రమం నుంచి వాడిని వాళ్ళ ఊరు, జామ్‌ఖడ్‌కి పంపేశాను. దేశాటనకి బయలుదేరేముందు. ఈ సంగతి పాఠకులకి గుర్తుంది కదా! మరి ఈవాళ వసంత్ ప్రస్తావన ఎందుకనో అనుకొంటున్నారా, అయితే వినండి బాబావారేమన్నారో? అఘూ ఆలీకీ, వసంత్‌కీ పెద్ద తేడా లేదన్నారు.
ఇద్దరికీ తమ వద్దనే వుండాలని వుందన్నారు.
అయితే ఆలీని పంపించినట్లే వసంత్‌ని కూడా వాళ్ళ నాన్న దగ్గరకి పంపేశానన్నారు.
వసంత్‌కి నేనే సర్వస్వం. నా ప్రక్కనే వుండాలని వాడు కొట్టుకుపోతున్నాడు.
కానీ ఇంటికి వెళ్ళి అమ్మా నాన్నతో వుండమన్నాను.
తాను ఎవరి గురించీ దిగులుపడలేదన్నారు. కానీ వీరిద్దరి విషయంలో అయ్యో, అనిపిస్తోంది. బాధపడుతున్నాను.
ఈ నా బాధ, తపన ఇదే వాళ్ళిద్దరికీ నేనిచ్చే బహుమానం అన్నారు.
ఆవేళ మధ్యాహ్నం జాల్, నౌసేర్వాన్ సాథే వచ్చారు.
పునా కబుర్లు చెప్పారు. అహమ్మద్ నగర్ విశేషాలు చెవిని వేశారు.
స్త్రీ మండలి హాస్యనాటిక ప్రదర్శించారు. బాబావారు కడుపుబ్బా నవ్వారు.
ప్రభువుకి కావల్సింది హాస్యం, హాస్యంతో కూడిన వినోదం.
విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమంలో అలసిసొలసిన బాబావారికి
స్త్రీ మండలివారిచ్చే కానుక ఈ నాటకాలు. బాబావారు ఫలాన రోజుకి వస్తారని తెలుసు కాబట్టి, ఆయన రైలు ఎక్కగానే స్త్రీ మండలి నాటకాలపై కసరత్తు మొదలుపెట్టేవారు. వినోద ప్రాధాన్యత వున్న ఇతివృత్తాన్ని ఎన్నుకొని, నాటకం వ్రాసుకొని చక్కగా రిహార్సల్స్ చేసేవారు. బాబావారు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు నాటకం వెద్దామనే ఎదురు చూసేవారు.
నాటకం చూసి బాబావారు హాయిగా నవ్వుతుంటే,
వీళ్ళు పొంగిపోయేవారు. సృష్టికర్తకే వినోదం కల్గించడం అదీ తమ సృష్టితో, ఎంత అదృష్టమోకదా! ఈ నాటకం పేరు చెప్పి, స్త్రీ మండలి మరో పని ఏదీ చేసేవారు కాదని అనుకోకండి. బాబావారు ఎన్నో పనులు అప్పగించేవారు వాళ్ళకి.
ఆ పనులు చేస్తూనే, ఓ ప్రక్క నాటకంపై దృష్టి పెట్టేవారు. అంటే ప్రభువికి ఆనందం,

వినోదం కల్గించబోతున్నాం కదా, ప్రభువు మెప్పు పొందుతాం కదా అని ప్రభువాజ్ఞని విస్మరించేవారు కాదు. అలా చేస్తే బాబావారు మెచ్చరని వాళ్ళకి తెలుసు.
అందుకనే విధి నిర్వహణలో లోపం రానిచ్చేవారు కాదు ఎప్పుడూ.
ఇంతకీ ఈ స్త్రీ మండలి ఎవరని కదూ మీ ప్రశ్న. అయితే వినండి.
మెహెరా, దౌలత్, నాజా, సూనా, పెద్ద ఖుర్షెద్, చిన్న ఖుర్షెద్ వున్నారు నాసిక్‌లో చాలా రోజులుగా. అంటే బాబావారు కాశ్మీరు యాత్రకి బయలుదేరినప్పటి నుంచి.
గుల్మాయి కూతురు డాలీ మాత్రం నగర్‌లో వుంటోంది.
బాబా కాశ్మీర్‌కి బయలుదేరేముందే ఆవిడ నగర్‌కి వెళ్ళింది.
దరిమిలా నాసిక్ వచ్చి, స్త్రీ మండలిలో చేరిందనుకోండి.
వాళ్ళకి ఏమి కావల్సివచ్చినా చేదోడు వాదోడుగా వుంటున్నాడు మాసాజీ.
బజారు పనులు ఆయనే చూస్తున్నాడు. సరే, సరదాగా అందరితో రెండు రోజులు గడిపాక బాబావారు మళ్ళా రోడ్డు దారి పట్టారు. ఈసారి ఎక్కడికి? ఇంకెక్కడికి మెహెరాబాద్‌కి. 27వ తేదీన బస్సు బయలుదేరింది.
నాసిక్ మీదగానే మన్మాడ్, ఆ తర్వాత షిర్డీ వచ్చారు.
బస్సుని ఆపమనలేదు బాబావారు. పాద్రీ బస్సుని ఆపలేదు.
షిర్డీ దాటిన ఓ అరగంటకు రాహూరి వచ్చింది.
ఠపీమని బస్సుని ఆపించారు బాబావారు. ఎందుకని అడగలేదు ఎవ్వరూ.
అందరూ బిల బిలా బస్సు దిగారు. బాబావారు కూడా బస్సు దిగారు.
ఎదురుగా కనిపించిన చెట్టు క్రింద కూర్చొన్నారు. పిచ్చాపాటీ మాట్లాడుకోవచ్చునుకొన్నారు మండలివారు. కానీ చర్చ భవిష్యత్ కార్యక్రమంపైకి వెళ్ళింది.
ఏం చేయాలి, ఎలా చేయాలి, ఎంత కాలం చేయాలి అందరూ తలోమాట అంటున్నారు.
ఓ ప్రక్క గోధూళికి వేళవుతోంది. సూర్యుడు అస్తమిస్తున్నాడు.
చర్చ ఓ కొలిక్కి రావటంలేదు. ఇంతలో బాబావారు – నాకు ఆరతి ఇవ్వాలి అన్నారు.
ఎవ్వరూ ఊహించలేదు, బాబావారు ఆరతి ఇమ్మంటారని.
అదీ ఈ సంధ్యా సమయంలో. కాస్తంత ఆశ్యర్యపడ్డారు.
వెంటనే తేరుకొని కలియుగావతారుడికి ఆరతి పట్టారు. ప్రభు గానం చేశారు.
జేజేలు పలికారు. పాదాభివందనం చేశారు. మళ్ళీ భవిష్య ప్రణాళిక ఎలా వుండాలన్న తర్జన భర్జన మొదలయింది. బాబావారు వాళ్ళ మాటలు వింటున్నారు. తమ అభిప్రాయం చెప్పటం లేదు. ఎవరి సలహా అయినా బాగుంది అనిపిస్తే, తల పంకిస్తున్నారు అంతే.
ఓ ఐదు నిముషాలు పోయాక సడన్‌గా ఆరతి పట్టండి వెంటనే అన్నారు.
మళ్ళీ ఇంకోసారా! ఆశ్చర్య చకితులయ్యారు మండలి. వెంటనే ఆరతి పట్టారు.
ఒకే రోజున అదీ ఐదు నిముషాల వ్యవధిలో బాబావారు ఆరతి పట్టమనడం,

మండలివారు మనసారా ఆరతి పాడటం ఎప్పుడూ జరగలేదు అప్పటి వరకూ.
ఆ తర్వాత కూడా. ఆనాటి మండలివారు ఎంత అదృష్టవంతులో కదూ!
దేవగానలహరిలో తేలిపోయే మహదవకాశం అందరి సొత్తూ కాదు.
పూర్వజన్మ సుకృతం ఏ కొందరినో వరిస్తుంది ఆ అదృష్టం.
మరి దేవగానం చెవిలో మరుమ్రోగాలంటే? ప్రత్యక్ష దేవుడిని ఆరాధిస్తే చాలు దేవగానం వినిపిస్తుంది. మధురానందం సొంతమవుతుంది. ఇదంతా ప్రభు లీల.
ఆ లీలామానుష రూపుని వినోద ప్రహేళ. ఎన్నో నెలలుగా మూగనోము చేపట్టి, మౌన విరమణ చేస్తున్నానని వూరించి వూరించి, రాహురి రోడ్డు ప్రక్కన ఆరతి పట్టించుకోవడమేమిటి? చిదానందుని చిత్తము ఎరుంగనెవరితరమన్న కవి వాక్కు నిజమే సుమా అనిపిస్తుంది. ఈ సంఘటన తర్వాత. మళ్ళీ అందరూ బస్సు ఎక్కారు నగర్ దారి పట్టారు. అక్బర్ ప్రెస్ దగ్గర బస్సు ఆగే సరికి పెద్ద గుంపు కనిపించింది. మెహెర్ ప్రభు దర్శనార్ధం వచ్చారట వాళ్ళందరూ.
వాళ్ళ మనోభీష్టం నెరవేర్చారు బాబా. రాత్రి భోజనం అయ్యాక మెహెరాబాద్ చేరారు.
ఆగస్టు 27వ తేదీపై తెరపడింది. పర్షియా మరోసారి వెళ్ళాలని వుందన్నారు బాబా.
ఎప్పుడు బయలుదేరాలి. వీసా వగైరా ఎవరు తీసుకువస్తారు.
ఎవరెవరు బాబావారి వెంట వెళ్తారు. ఎన్నో ప్రశ్నలు. మరెన్నో శేష ప్రశ్నలు.
ఆరు రోజులపాటు అంటే సెప్టెంబరు 2వ తేదీ వరకు రోజూ ఇదే చర్చనీయాంశం.
తమ వెంట పదకొండు మందిని తీసుకువెళ్తామన్నారు బాబా.
బువాసాహెబ్, ఛాన్జీ, గుస్తాద్‌జీ, కళింగడ్, కరీం, మారుతీపటేల్, మాసాజీ, సిద్ధూ, విష్ణు తమతో వస్తారన్నారు. పదకొండు మంది అని, పది పేర్లు చెప్పారేమిటి అనుకొంటున్నారా పాఠకమహాశయా, అయితే వినండి. ఆపద కొండవ వ్యక్తి ఎవరన్న ధర్మ సందేహాన్ని బాబావారే తీర్చారు. జాల్ కూడా వస్తాడు పర్షియాకి అన్నారు.
మీకు తెలుసుగా స్వయానా బాబావారి తమ్ముడు.
మరో నలుగురు పర్షియా వెడుతున్నారన్న సంగతి పాఠకులకి తెలుసు.
ఆదీ ద్వయం, అబ్దుల్లా, రావ్‌సాహెబ్ వెంట పర్షియ వెడుతున్నారు.
వాళ్ళపాటికి క్వెట్టా చేరారు. బాబావారు టెలిగ్రామ్ పంపారు వాళ్ళకి.
తమని పర్షియాలో కలవమని ఆదేశించారు. ఇది ఆఘూ ఆలీ ప్రేమ ప్రభావం అంటారా? ప్రభు లీల అంటారా? ఆలీ ప్రేమ ఎంత గొప్పదో బాబావారే స్వయంగా చెప్పారు. తమ నుంచి దూరం కావటంతో ఆ పిల్లవాడు ఎంతగా కుమిలిపోతున్నాడో కూడా బాబావారికి తెలుసు ఆలీ మనోక్షోభ. వాడి వాడి బాణాల్లా వచ్చిపడుతున్నాయి తమపైన అని శెలవిచ్చారు కూడా. మరి ఇప్పుడేమో పర్షియాలో దర్శనం దొరుకుతుందోయి బెంగపడకు అన్న మాట చెప్పకనే చెప్పారు. సరే ఆ సంగతి అలా

వుంచితే, మండలివారిద్దరికి స్థాన చలనం కలిగించారు బాబావారు. తాము పర్షియా వెళ్తున్నారు కాబట్టి సైలర్‌ని నాసిక్ వెళ్ళమన్నారు. బాబూ సైకిల్‌వాలాని మన్మాడ్‌లో వుండమన్నారు. ఇహ మెహెరాబాద్‌లో ఎవరు వుంటారు? బొమ్మన్, బైలీ, దస్తూర్, పాడ్రీ, రమ్జూలని మెహెరాబాద్‌లో వుంటారని స్పష్టం చేశారు. మీతోనే వుంటాడు మస్తాన్ అన్నారు. అతగాడొక మస్తు. అప్పట్లో ప్రేమాశ్రమం పిల్లలు అయిదుగురు అక్బర్ ప్రెస్‌లో వుంటున్నారు. అది బాబా ఆజ్ఞ. పాపం వసంత్‌కి ఇష్టం లేకపోయినా బాబావారి ఆజ్ఞ ప్రకారం జామ్‌ఖేడ్‌లో వున్నాడు. వసంత్ అంటే బాబావారికి వల్లమాలిన ఇష్టం. ప్రేమాశ్రమానికి తలమానికం వసంత్ అనేవారు బాబా. సెప్టెంబరు ఒకటవ తేదీన వసంత్ ప్రస్తావన వచ్చింది. అప్పుడూ అదేమాట అన్నారు. ప్రేమాశ్రమం పిల్లలు అందరిలోకీ సర్వోత్తముడు వసంత్ అన్నారు.

నేనిప్పుడు కనుక వాడిని కలవకుండా వెళ్ళితే, తట్టుకోలేడు. మెహెరాబాద్‌కి తిరిగి వచ్చాననీ, ఓ రెండు రోజులు వుండి కూడా వాడిని పట్టించుకోకుండా పర్షియా వెళ్ళానని తెలిస్తే వాడి గుండె తరుక్కుపోతుంది.

ఆ దు:ఖంలో ప్రాణాలు కూడా పోవచ్చు. అందుకని వసంత్‌ని కలిసి ఓ అరగంట అయినా నా సహవాస భాగ్యం కల్గిస్తానన్నారు ప్రేమమూర్తి. భక్తుడి వయస్సుతో నిమిత్తం లేదు ప్రభుకి. ఆయనకి కావల్సింది ప్రేమ.

అది పుష్కలంగా వుంది వసంత్ దగ్గర. అందుకని సెప్టెంబరు 2వ తేదీన బాబావారు జామ్‌ఖేడ్‌కి బయలుదేరారు. ఆ ఊరేమీ దగ్గర లేదు. 60 మైళ్ళ పైచిలుకు దూరం. రోడ్డు అధ్వానంగా వుంది. కానీ అది అయితే వసంత్ ప్రేమ బాట. బాబావారి దర్శనంతో ఆ చిన్నారి ఉప్పొంగిపోయాడు. నీ పేరు చెప్పి యుగావతారుడి దర్శనం మా ముంగిట లభించిందని ఊరివారంతా పులకించిపోయారు.

జన్మ ధన్యమయిందనుకొన్నారు. ఇహ పర్షియా ప్రయాణానికివస్తే, బాబావారు బొంబాయికి సెప్టెంబరు మూడవ తేదీన బయలుదేరారు.

మెహెరాబాద్ నుంచి. పాస్‌పోర్టు, వీసాలకు రెండు వారాలు పడుతుంది కాబట్టి తొందరగా రండి అని బొంబాయి ప్రేమికులు చెప్పారట.

అక్కడ బస తలాతీల ఇంట.

నావల్, దీనా తలాతీ దంపతుల ఇల్లు బైకుల్లాలో వుంది. 'శివలీలా బిల్డింగ్స్' ఆ భవంతి పేరు. బాబావారిని దర్శించాలని చాలామంది తహతహలాడుతున్నారని దీనా బాబావారికి చెప్పింది. బాబావారు ఎందుకనో ఏమో ఎవరికీ దర్శనం ఇవ్వమన్నారు. నా దర్శనం కోసం ఎవరు వచ్చినా లోపలికి రానివ్వద్దని స్పష్టం చేశారు.

ఎవరు వచ్చి అడిగినా నిర్మొహమాటంగా చెప్పు బాబావారు దర్శనం ఇవ్వరని అన్నారు.

కొత్త పుస్తకం

# పురాణపురుషుడు




మండలి సభ్యుడైన ఏరుచ్ జెస్సావాలా అవతార్ మెహెర్‌బాబాతో తన సుదీర్ఘ అనుభవాలను అనుభూతులను చిన్న కథల రూపంలో **ANCIENT ONE** అనే గ్రంథంలో చక్కగా వివరించారు. ఇంగ్లీషులో వున్న ఈ పుస్తకాన్ని **'పురాణపురుషుడు'** అనే పేరుతో శ్రీమతి లతా విష్ణురావు తెలుగులో అనువదించి 1990లో ప్రచురించారు. నేడు ఈ పుస్తకాలు అలభ్యం. ఈ అవసరాన్ని గుర్తించి, శ్రీ పేరూరి వెంకట సూర్యనారాయణ శర్మ, తణుకు బాబా సెంటర్ తరఫున ఇటీవల పునర్ముద్రించి బాబా ప్రేమికులందరికీ అందుబాటులో ఉంచే ప్రయత్నం చేశారు. శ్రీ శర్మ తన భార్య శ్రీమతి విజయలక్ష్మి కామేశ్వరి స్మృత్యర్థం పునర్ముద్రణ చేపట్టినట్లు ఈ పుస్తకం ముందుమాటలో పేర్కొన్నారు. అవతారుని కార్యక్రమంలో ఇదొక చక్కని సాహిత్యసేవ. ప్రతి బాబా ప్రేమికుడు తప్పక చదివి తీరాల్సిన గ్రంథం **'పురాణపురుషుడు'.** ప్రతి ఇంటా తప్పక ఉండాల్సిన గ్రంథం. 212 పేజీలు గల ఈ పుస్తకం యొక్క ఖరీదు గ్రంథంలో ఎక్కడా ముద్రించ లేదు. ఐతే, ఈ పుస్తకం వెల రూ. 50/-గా నిర్ణయించినట్లు తెలుస్తోంది. మరిన్ని వివరాలకు శ్రీ పేరూరి శర్మ గారిని 945901 71930., లేదా 08819 - 223925 సంప్రదించగలరు.

## వివాహం

శ్రీ మద్దాలి దుర్గా ప్రసవద్, శ్రీమతి భాగ్య సుందరి గార్ల కుమారుడు చి॥ త్రినాధ్ మెహేర్ శంకర్ వివాహం చి॥ల॥సౌ॥ నాగ వెంకట సవయి లలితా ప్రియాంకతో ది: 12.12.2014 శుక్రవారం రాత్రి గం. 4.08 ని.లకు సిద్దార్థనగర్, విజయవాడ నందు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

## కామారెడ్డిలో బాబా జన్మదిన వేడుకలు

కామారెడ్డిలో మెహెర్‌బాబావారి 121వ జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా 28.10.2014 మంగళవారం నుండి ప్రతిరోజు ఉ. 5.15 ని॥ల నుండి 6.15 ని॥ల వరకు 25.02.2015 వరకు **నగర సంకీర్తన** చేయుటకు నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

# T.O.M.B.

బాబా మండలి సభ్యులు శ్రీ బాలనాటు ఎగువ మెహెరాబాద్‌కు వెళ్ళారా?
బాబాని దర్శించుకున్నారా? అని బాబా ప్రేమికులను అడగటం సబబు అంటాడు.
బాబా సమాధిని దర్శించారా? అనే ప్రశ్న సరైంది కాదంటాడాయన.
నేను ఎప్పుడూ ఎగువ మెహెరాబాద్‌కు వెళ్ళారా?
బాబాని దర్శించుకున్నారా? ఆయన ఆశీశ్శులు అందుకున్నారా?
ఇలాగే అడిగేవాడినంటాడు. నా మాటల్లోని అంతరార్థం అర్థం చేసుకునేవారో? లేదో?
కానీ, నా మటుకు ఇదే కరెక్టు అని ఆయన సాధికారంగా చెప్తున్నాననేవాడు.
బాబా ప్రేమికులందరితో అనుక్షణం బాబా మాట్లాడుతూనే వున్నారు కదా..
ప్రతి చిన్న విషయం, అది ఏమైనప్పటికీ, మీ మనస్సులో బాబాని ప్రశ్నించగానే
ఉత్తర క్షణంలో జవాబు దొరుకుతోంది కదా.. మీలోని భావాలకు, మాటలకు, ప్రశ్నకు,
శంకలకు..వీటికీ..వాటికీ ...అన్నింటికీ అన్నివేళలా సమాధానాలు చిక్కుతున్నాయా?
లేదా? అని బాలనాటు బాబా ప్రేమికులందర్నీ ఉద్దేశించి ఓ సందర్భంలో ప్రశ్నించారు.
ఎవరి ప్రశ్నలు వారివి. అవన్నీ వ్యక్తిగతం. వారి వారి హృదయాలతో బాబా నేరుగా
మాట్లాడుతున్నారు. అందుకే ఆయన సమాధి దర్శించామని అనడం
సరికాదంటానంటారు..బాలనాటు. బాబా సజీవంగా మన శ్వాస కన్నా దగ్గరగా
వున్నప్పుడు, బాబా సమాధి అనడం ఏమిటి. ఈ పదం మనకు ఒప్పదు.
ఎంతో ఆలోచించాక, ఎన్నో పర్యాయ పదాలు పరిశీలించాక
**Baba's Tomb** - బాబా సమాధి – అని అనడానికి బదులు నేను
**T. O .M .B** అంటే – **Timeless One Meher Baba** అని అనడమే
కరెక్టు అని బాబాతో ముచ్చటించి నిర్ధారించానన్నారు.
, + ^ ŵ ȿý Ë e Úą · **T O M B** అనే పదంలో మనకు చివరి రెండు మాటలు–
**M B** – మెహెర్‌బాబా అని మనకు తెలుసు. ఇకపోతే ముందున్న రెండు మాటలు
**T O** అంటే **Timeless One** అని నిర్ధారించుకున్నాను.
అదే కదా సమాధి లోపల తెల్లపాలరాయిపై కూడా రాసింది.
...**Eternal Beloved..** అని రాశారు. ఆ మాటలకు సమానార్థం **Timeless One** అనే కదా అని బాబాని అడిగాను. ఇది నీ చమత్కారం కదా అని బాబాని
అడిగితే, బాబా కూడా నవ్వుతూ ఔనన్నారు. ఈ విషయాలను బాబాతో తాను జరిపిన
సంభాషణను బాలనాటు రాసిన ఒక చిన్న గ్రంధంలో ఉటంకించారు.
**ఈ మాటల్లో ఎంతో అర్థం వుంది కదా? ఇంతకాలం మనం బాబా సమాధికి**
**వెళ్ళాం..వెళ్తున్నాం..అంటున్నాం.. ఇకపై బాలనాటు గారితో ఏకీభవిస్తే ..**
**ఆ మాటల్ని నేటితో నిషిద్ధాక్షరాలు చేద్దాం...**

# తెలుగు సహవాస్

నవంబరు 13 ఆదివారం ఉ. 7.30 నిముషాలకి మెహెర్‌బాబా మెహెరాబాద్‌కు విచ్చేసారు. బాబా సమావేశమందిరంలోకి అడుగిడుతుంటే కొంతమంది ప్రేమికులు పూలమాలలు వేశారు. అందుకు బాబా నవ్వుతూ...మీరు ప్రేమతో పూలదండలు వేశారు. చాలా సంతోషం. కానీ, మొదటి రోజున మీలో ప్రతిఒక్కరూ పూలదండలు వేశారు. ప్రతిరోజూ ఈ మాదిరిగా పూలదండలు వెయ్యాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అంతేకాదు, నాకున్నది రెండే రెండు కోట్లు. ఈ గులాబీ కోటంటే నాకెంతో ఇష్టం. మీరు కనుక ఈ మాదిరిగా ప్రతిరోజూ పూలదండలు వేస్తుంటే, ప్రతిరోజూ ఈ కోటుని ఉతకడానికి ఇవ్వాల్సి వస్తుందని చమత్కరించారు.

రాత్రి అందరూ బాగా నిద్రపోయారా? అని బాబా సహవాసీలందర్నీ అడిగారు. తమకు నిద్ర పట్టలేదని, జలుబు, దగ్గులతో బాధపడ్డామని కొందరు పిర్యాదు చేశారు. ఇలాంటి వారి కోసమని చెప్పి బాబా ప్రత్యేకంగా మండలి సభ్యుడైన డా॥ నీలును తగిన వైద్యం అందించేందుకు నియమించారు. నిద్రపట్టని ఒక ప్రేమికుడు లేచి బాబాతో ఇలా అన్నాడు. నిద్రపోయే ముందు 14 సార్లు నీ నామం తలుచుకోమన్నావు కదా, కాని నేను రాత్రంతా నీ నామం స్మరిస్తుండటం వల్ల నాకు నిద్రపట్టలేదని, ఇలాంటి పరిస్థితుల్లో నేనేం చేయాలని అడిగాడు. బాబా నవ్వుతూ, నా నామం 14 సార్లు కన్నా తక్కువ కాకుండా నీకిష్టమైనన్ని ఎక్కువ సార్లు తలుచుకున్నా తప్పులేదన్నారు. ఆదీ దుబాష్ కూడా లేచి నాకు నిద్రపట్టలేదని పిర్యాదు చేశాడు. నిద్రపట్టకపోయినా మించిపోయినది ఏమీ లేదంటూ బాబా, నేను వరుసగా సుమారు 15 రోజులకు పైగా నిద్రలేకుండా చాలాసార్లు వున్నానన్నారు. నా మండలి సభ్యులలో కూడా చాలామంది ఏదో ఒక మిషతో తరచూ నిద్రలేని రాత్రులు గడుపుతూనే వుంటారన్నారు. ఈ విషయంలో నా మండలి సభ్యుడైన ఏరుచ్‌కి సాటి మరొకరు లేరన్నారు.

మేం మస్తుల అన్వేషణలో 15-20 రోజులపాటు నిరంతరంగా ప్రయాణించేటప్పుడు నాకు, నాతోపాటు వున్నవారందరికీ సరైన నిద్ర, ఆహారం, విశ్రాంతి వుండేవి కాదు. మీకు ఎప్పుడు నిద్రపోవాలనిపిస్తే అప్పుడు నిద్రపోండి. బలవంతంగా మెలకువగా వుండాల్సిన పనిలేదు. ఆలోచనలు లేకుండా ప్రశాంతంగా నిద్ర వస్తే హాయిగా నిద్రపోండి. లేదా నిద్ర రాలేదని అదే పనిగా బాధపడకండి. నిద్ర పట్టకపోతే, నా నామం స్మరించండి అని బాబా సలహా ఇచ్చారు.

బాబా కార్యక్రమాలు ఏ విధంగా చేపట్టాలి? అనేదానిపై బాబా వివరణ ఇలా ఇచ్చారు. ప్రస్తుతం తెలుగునాట తన కార్యక్రమాలు జరుగుతున్న తీరు బాగాలేదన్నారు.

ఈ విషయమై గుజరాతీ సహవాస్‌లోని అంశాలను ఏరుచ్‌ని చదివి వినిపించమన్నారు.
ఆ తర్వాత తనకు ఢిల్లీ, డెహ్రాడూన్ అలాగే దక్షిణాది నుండి అనేక మంది మహిళా
ప్రేమికులు ఉత్తరాలు, టెలిగ్రాంలు పంపుతున్నారన్నారు. నేను మగవారినే సహవాస్‌కి
పిలుస్తున్నానని, ఆడవారిని ఆహ్వానించడంలేదన్నది వారి ఫిర్యాదు.
ఎందుకీ వివక్ష అని వారు నన్ను ప్రశ్నిస్తున్నారు.
మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయవచ్చు కదా అని వారడగుతున్నారు.
అయితే, ఇందుకు తగిన సమాధానం నా దగ్గర వుందని చెబుతూ బాబా ఇలా
అన్నారు. నాకు స్త్రీలు, పురుషులు అనే బేధమే లేదన్నారు.
ఈ వివక్షకు తాను అతీతుడునన్నారు.
మీరు ఎప్పుడైతే స్త్రీ, పురుషులు అని వ్యత్యాసం చూపిస్తూ,
స్త్రీలకి బాబా దర్శన అవకాశం ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నిస్తే, తానిలా
చెప్పదల్చానన్నారు. వచ్చిన చిక్కల్లా స్త్రీలను సహవాస్‌కంటూ ఆహ్వానిస్తే,
స్త్రీలతోపాటు ముందుగా వారి పిల్లలు, ఆ తర్వాత వారి భర్తలు
అందరూ ఇక్కడకు రావాల్సి వుంటుంది. ఇలా ఇంతమంది ఇక్కడకు వస్తే,
ఒక్కొక్క కుటుంబానికి ఒక చిన్న కుటీరాన్ని ఇక్కడ మండలివారు నిర్మించాల్సి వస్తుంది.
ఇది ఎంతో శ్రమ, ఖర్చుతో కూడుకున్న విషయం అన్నారు.
నేడు మీరందరూ నేను పిలవగానే వచ్చారు. మీరు ఇక్కడ వున్నా,
మీ భార్యలు, మీమీ పిల్లల్నీ ఇతర సంసార విషయాలన్నీ చక్కగా చూసుకుంటున్నారు.
అదే స్త్రీలను కూడా ఆహ్వానించి వున్నట్లైతే, వారు వారి పిల్లల బాగోగులు
చూసుకోవడానికే సగం సమయం సరిపోతుంది. సహవాస్ కంటే
వారి పిల్లల బాగోగులకే చాలాసమయం కేటాయించవల్సివస్తుంది.
అంతేకాకుండా, మీ భార్యా, పిల్లా పాపలతో మీరందరూ ఇంత దూరం
ప్రయాణించాలంటే కూడా ఎంతో ఖర్చు, శ్రమతో కూడివుంటుందన్నారు బాబా.
మీకిక్కడ తిండి విషయంలో గాని, పడక విషయంలో గాని మరేమైనా సమస్యలు,
కష్టాలు వుంటే మగవారిగా మీరు చాలా వరకు భరించగల్గుతారు.
కాని, ఆడవారి విషయంలో అది సాధ్యం కాదు కదా అని అవతారుడు అన్నారు.
స్త్రీలకు ప్రత్యేక సహవాస్ ఏర్పాటు చేసేందుకు నాకెలాంటి అభ్యంతరం లేదన్నారు.
నాకూ అలాంటి ఆలోచన ఒకటుందన్నారు. కాని అది తన వాగ్దానం కాదన్నారు.
ఈ నెల రోజుల ప్రాంతీయ సహవాస్ కార్యక్రమాలు అయిపోయిన తర్వాత
డిసెంబరు నెలలో ఒక్కొక్క ప్రాంతంలో ఒకరోజు చొప్పున
స్త్రీలకు ప్రత్యేకంగా సహవాస్, దర్శన కార్యక్రమాలు ఏర్పాటు
చేయాలనుకుంటున్నానన్నారు.

అదే మాదిరిగా పాశ్చ్యాత్య బాబా స్త్రీ ప్రేమికుల కోసం కూడా
ప్రత్యేక సహవాస్ ఏర్పాటు చేయాలనుకుంటున్నానని
అమెరికన్ బాబా ప్రేమికుడైన డాన్ స్టీవెన్స్‌తో చెప్పానన్నారు.
అయితే వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి నేను మండలివారందరికీ
దూరంగా ఏకాంతవాసంలో వుండదల్చాను.
కాబట్టి నా వీలునుబట్టి ఈ దర్శన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తానన్నారు.
ఆంధ్రా, హమీర్‌పూర్, ముంబాయి, డెహ్రాడూన్, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల్లో
ఒక్కొక్కచోట ఒకరోజు చొప్పున స్త్రీల కోసం ప్రత్యేక సహవాస్ ఏర్పాటు
చేయాలనుకుంటున్నాను. అది కనుక ఖాయమైతే మీ అందరికీ తెలియచేస్తాను.
నా విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమం కోసం ఒక ఏడాదిపాటు మీ అందరి నుండి దూరంగా
ఏకాంతవాసం ఉండదల్చాను. అయితే నా ప్రేమికులకు ఇవ్వదల్చిన దర్శన కార్యక్రమం
కూడా చాలా ముఖ్యమైనదే. కాదనలేను. నా ప్రేమికుల ప్రేమ చాలా ప్రధానమైంది.
నేను ఏడాదిపాటు వెళ్తున్న ఏకాంతవాసానికి తగిన ముందస్తు ఏర్పాట్లు
చేయవల్సి వుంది. అదే సమయంలో ఆంధ్రాలో వారు ఎంపిక చేసుకున్న
ఏదేని రెండు సెంటర్లలో ఒక్కొక్క సెంటర్లో ఒక్కొక్క రోజు చొప్పున నా దర్శన,
సహవాస్ కార్యక్రమం ఇవ్వదల్చాను.
ఆ మాదిరిగా మీకు వీలైతే తగిన ఏర్పాట్లు చేయండి.
లేదంటే బాధపడొద్దన్నారు.
మీరు ఆంధ్రా పర్యటనకు వచ్చినప్పుడు నా కారు ఉపయోగించుకోమని
కాకినాడ నుండి వచ్చిన బాబా ప్రేమికుడు ఒకరు అన్నారు.
అలాగే అని బాబా జవాబిస్తూ, ప్రస్తుతం నేను మెహెర్‌జీ, నారిమన్‌లు ఇచ్చిన రెండు
కార్లను ఉపయోగిస్తున్నాను. నాకంటూ సొంతంగా కారు లేదు.
ఎవరైనా మీలాంటివాళ్ళు ఇచ్చినదే నేను వాడుకుంటున్నానని బాబా అన్నారు.
దక్షిణ భారతం అంటే నాకెంతో ఇష్టమని బాబా అన్నారు.
దక్షిణాదితో అనాదిగా తనకెంతో సంబంధం వుందన్నారు.
అది మీకు అర్ధంకాదులే అన్నారు.
అలా అంటూనే సాధ్యమైనంత వరకు ఆంధ్రాలో తన సహవాస్ కోసం
రెండు సెంటర్లను ఎంపిక చేయమన్నారు.
24 గంటలపాటు దర్శనమిస్తానన్నారు.
కేవలం మహిళలనే అనుమతిస్తామన్నారు. పురుషులకు అనుమతి లేదన్నారు.
అలాగే కొంత సమయాన్ని చిన్నపిల్లలకు కేటాయిస్తామన్నారు.
వారూ తన నామ వ్యాప్తికి సహకరిస్తారన్నారు.

కొంతమంది స్త్రీలను తన నామ వ్యాప్తికి ఎంపికచేస్తానన్నారు.
ఈ రెండ్రోజుల సహవాస్ కార్యక్రమంలో నా కోసం, నా తిండి, నా విశ్రాంతి, బస, నిద్ర ఇతర సుఖవంతమైన ఏర్పాట్ల కోసం బాధపడొద్దన్నారు. బాబా డా॥ ధనపతిరావును పిలిచారు. నాడి చూడమన్నారు. నార్మల్‌గా వుందని డా॥ ధనపతి అన్నారు.
బాబా ముఖ కవళికలలో మార్పులు మీరు గమనించే వుంటారని ఏరుచ్ అన్నాడు.
ఒక సందర్భంలో గంభీరంగా, ఆనందంగా, ప్రకాశవంతంగానూ,
మరో సందర్భంలో బాగా అలసిపోయినట్లు కనిపించడం మీరు గమనించే వుంటారని ఏరుచ్ అన్నాడు. మీ అందరితో సహవాస్‌లో పాల్గొనడం నాకు చాలా సంతోషంగా వుందని బాబా అంటూ, ఈ సృష్టి అనేది మీ మనస్సు వల్లనే ఏర్పడిందన్నారు.
ఇదంతా నిజం కాదు. అంతా మనం ఊహించుకున్నదే. ఇందంతా మిథ్య.
మీరు చూసేది నిజం కానే కాదు. ఈ బంధనాలలో చిక్కుకోవడానికి
మీ మనస్సే కారణం అన్నారు. అనాదిగా మీరందరూ స్వేచ్ఛాజీవులు.
మిమ్ముల్ని ఏవీ నియంత్రించ లేదు. కానీ మీ మనస్సు వల్ల
ఈ మాయామయ జగత్తులో మీరు బంధీ అయ్యారు.
ఈ మాటలు మీకు అర్థమవుతాయి.
కానీ మీరు ఈ మాటల వెనుక వున్న అర్థాన్ని అనుభవపూర్వకంగా అనుభవించ లేరు.
మీ మనస్సుని నియంత్రించాలి. దాన్ని కట్టడి చేయండి. కూకటి వేళ్ళతో
దాన్ని పెకిలించేయండి. నా దివ్య స్వరూపాన్ని మీ దర్శించుకున్న వేళ
అన్నీ వాటికవే మటుమాయమౌతాయి.
ఆ సమయంలోనే మీరేమిటో, నా నిజరూపం కూడా తెలుస్తుంది.
భగవంతుని కృప అంటే ఏమిటి?
తన నిరంతర శ్రమ, కఠోర కృషి వల్ల తానెవరో తెలుసుకునేందుకు
100 శాతం సిద్ధమయి, తానూ భగవంతుడు వేరు కాదు,
ఒక్కరే అని తెలుసుకున్నాడనుకోండి!! అది భగవంతుని కృప కాదు!!
మరి భగవంతుని కృప అంటే ఏమిటో చూడండి అంటూ బాబా ఇలా వివరించారు.
అదేమంటే, ఒక దుర్మార్గుడు, దేవుడున్నాడంటేనే నమ్మనివాడు,
ఒక పెద్ద పాపి నా ఎదుట నిలిచాడనుకోండి.
నేను ఆతనికి క్షణకాలంలో భగవసాక్షాత్కారం భాగ్యం కలిగించాననుకోండి,
ఆ భగవానుని దివ్యదర్శన భాగ్యం ఆ పాపి పొందితే...
అదిగో..అది భగవంతుని కృప లభించినట్లని బాబా వివరించారు.
నా కృప ఎవరిమీదనైనా ప్రసరిస్తే,
ఆతనికి క్షణకాలంలో భగవద్దర్శనం లభిస్తుంది.

తానూ భగవంతుడననే ఎరుక పొందుతాడు, అని బాబా వివరించారు.
ఐతే, ఇది చాలా చాలా కష్టం.
ఇకపోతే, నా కృప ప్రసరింపజేయడానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగానే వుంటాను.
కానీ, నా కృప పొందడానికే మీరే సిద్ధంగా వుండరన్నారు.
ఈ విషయాన్నే బాబా ఒక చక్కని ఉదాహరణతో ఇలా చెప్పారు.
పగటిపూట సూర్యుని కాంతి అందరిపై సమంగా ప్రసరిస్తుంది కదా!!
ఐతే మనం ఈ సిమెంటు కాంక్రీటు రూఫ్ క్రింద వున్నాం.
అందువల్ల ఈ గదిలోకి సూర్యకాంతి కిరణాలు నేరుగా రాలేవు.
ఈ గది పైభాగాన వున్న సిమెంటు స్లాబు అడ్డుగా నిలుస్తుంది.
ఆ సిమెంటు స్లాబుని నీవే ఏర్పాటు చేసుకున్నావు.
ఆ రూఫ్ తీసేస్తేనో, లేదా నీవే సిమెంటు గోడ పైకెళ్ళి సూర్యునికి ఎదురుగా నిలబడితే,
సూర్యకాంతి కిరణాలు నేరుగా మిమ్ముల్ని తాకుతాయి.
అదేమాదిరిగా, నీలో వున్న **'నేను'** అనే అహం
భగవంతునికి మీకూ అడ్డుగోడగా నిలుస్తోంది.
నా ప్రేమికులపై నా కృప నిరంతరం ప్రసరిస్తూనే వుంది.
కానీ మీలోని **'నేను'** అనే అహం అడ్డుగోడగా వుందని బాబా స్పష్టం చేశారు.
ఇప్పటిదాకా నేను చెప్పిన విషయాలన్నీ అనేక గ్రంధాలలో లభిస్తాయి.
అయితే వీటికి ఏమాత్రం విలువ వుండదన్నారు.
నేను ఈ అవతార కాలంలో మీకందించిన భగవద్వచన గ్రంథం నిరుపమానమైనది.
కానీ, సత్యంతో దాన్ని కూడా పోల్చి చూడలేం.
ఈ సృష్టి ఆవిర్భావం గురించి భగవద్వచనంలో వివరించడమైనది.
మీపై నా కృప ప్రసరించాలంటే సరైన సమయం ఆసన్నమవాలి.
మీలో ఏమైనా చెడు ఆలోచనలు వస్తుంటే, వాటిల్ని పట్టించుకోకండి.
నా నామం మరచిపోకుండా స్మరించండి.
**బాబా బాబా** అని రోజుకి 14 సార్లు తక్కువ కాకుండా నా నామం స్మరించండి.
మీలో వున్న మాయా తెర తొలగిపోయేలాగా నేను సహాయం అందిస్తాను.
మీలో ఎవరికి నా కృప అందించాలో నాకు తెలుసు.
అందుకు ఎవరు అర్హులో వారికి నేను తప్పక క్షణ కాలంలో అందిస్తాను.
నా ప్రేమ మీకు దొరికే వరకు నేనెవరో మీరెవరూ గుర్తించలేరు.
నేను అవతారుడినని నమ్మితే నాపట్ల విధేయతగా వుండండి.
నా ఆదేశాలు తు.చ. తప్పక పాటించండి.
నా అవతార తత్వంపై మీకెటువంటి అనుమానమున్నా

మీరు నాపై చూపే ప్రేమ, పూలదండలు వేయడం, గౌరవించడం ఇతరత్రా అన్నీ కూడా వ్యర్థం అన్నారు. అది గొప్ప హిపొక్రసీ అంటే కపట నాటకమౌతుందన్నారు. దీనివల్ల లాభం కన్నా నష్టం అధికమని హెచ్చరించారు. అనాదిగా నా గత అవతార కాలంలలో కూడా ఇలాంటి హెచ్చరికలు చేశాను.

**'అన్నీ వదిలి నన్ను అనుసరించు'!** అంటే అర్థం ఏమిటని బాబా ప్రశ్నించారు.

నాపట్ల విధేయతగా వుండమనే దాని అర్థం అన్నారు.

నేను మౌనం చేపట్టడానికి ముందు ఒక వ్యక్తి మెహెరాబాద్‌లో నన్ను కలుసుకున్నాడు. కళ్ళంబడి నీళ్ళు పెట్టుకున్నాడు. తనని నా ఆశ్రమంలో వుంచుకోమని ప్రాధేయపడ్డాడు. ఆ కోరికతోనే ఇంత దూరం వచ్చానన్నాడు. నూటికి నూరు శాతం నీపట్ల విధేయతగా వుంటానన్నాడు. అతనికి భార్య పిల్లలున్నారు.

నేను కనుక ఆదేశిస్తే నీ కొడుకు గొంతు కోసి నా దగ్గరకు తేగలవా? అని అడిగాను.

తప్పకుండా తేగలనని జవాబిచ్చాడు.

ఒంటి మీద నూలుపోగు లేకుండా నగ్నంగా నగరంలో తిరుగుతావా?

అని ప్రశ్నించాను. అదెలా సాధ్యం బాబా అని జవాబిచ్చాడు.

నేనప్పుడు ఆతనితో అన్నాను కదా, నేను నీకు కేవలం విధేయత గురించి

ఒక సూచన ప్రాయంగా చెప్పదల్చాను.

అది ఎంత కష్టమో తెలియజేయాలన్నదే నా ఉద్దేశ్యము.

నేనెన్నడూ నీ కొడుకు గొంతు కోసుకురమ్మని కాని, నగరంలో నగ్నంగా తిరగమని నెనెన్నడూ ఎవ్వరినీ ఆదేశించను. నీ విధేయత ఏపాటిదో తెలుసుకోవడానికే నేనలా అన్నానని బాబా అన్నారు.

రేపు ఉదయం 9 నుండి 10 గంటల దాకా పేదలకు అన్నదాన కార్యక్రమం వుంటుంది.

ఆ తర్వాత 10 నుండి 11 గంటల దాకా

తిరిగి సాయంత్రం 1 నుండి 4 దాకా ప్రతివారికీ వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ ఇస్తాను.

ఆ మర్నాడు బుర్రకథ కార్యక్రమాన్ని అందరూ వీక్షంచండన్నారు.

ఆ తర్వాత బాబా ప్రేమికుడు మెసలికంటి తిరుమలరావుగారు బాబా కార్యక్రమాల్ని ఎలా నిర్వహించాలి? అనే అంశంపై గల వ్రాత ప్రతిని చదివి వినిపించారు.

బాబా పనిని నిండైన ప్రేమతో నిజాయితీతో చేపట్టాలన్నారు.

అలాంటివారికి బాబా ప్రేమ లభిస్తుందని అన్నారు.

బాబా సూచించిన ప్రేమ, నిజాయితీ, నిస్వార్థ సేవ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలన్నారు. బాబా ప్రేమ సిద్ధాంతానికి బాబా ప్రేమికులు

పలువురికి ఆదర్శంగా వుండాలన్నారు.

మాటల్లో చేతల్లో అన్ని విధాలా సత్యం ప్రతిబింబించాలన్నారు.

బాబా సందేశాలను పలువురికి చెప్పేందుకు ప్రయత్నించేవారు
ముందుగా వారు ఆచరించి, ఆచరింపజేయాలన్నారు.
ఇందుకు ఉదాహరణగా బాబా ప్రేమికుడైన బాపిరాజును ఆదర్శంగా తీసుకోవాలన్నారు.
బాపిరాజుది మంచి హృదయమన్నారు.
గ్రామ గ్రామానా తిరిగి నా నామ వ్యాప్తికి ఆతను కృషిచేస్తున్నాడన్నారు.
ఈ ప్రపంచమంతా మిధ్య.
దాన్ని వదిలి బాబా నామం స్మరించండి.
వందలాదిమంది మీ మాటలు ఆలకిస్తుండంగా అవతార్ మెహెర్‌బాబాకి జై
అని బిగ్గరగా నినాదాలు చేస్తుండగా, ఒక ఘోర కారు ప్రమాదంలో మీ యావన్మంది
కుటుంబ సభ్యులు చనిపోయారని టెలిగ్రాం వస్తే,
అంతక్రితం వరకు ప్రపంచమంతా మిధ్య, బాబా ఒక్కటే సత్యం అని గొంతెత్తి బిగ్గరగా
మాట్లాడిన బాపిరాజులాంటివారు వణికిపోతూ, మాట తడబడుతూ
వేదిక దిగి ప్రమాద స్థలికి వెళ్ళే ప్రయత్నం చేస్తే,
అప్పటిదాకా మీ మాటలు ఆలకించిన ఆ జనసామాన్యం
మీ గురించి ఏమనుకుంటారో మీరే ఆలోచించండని బాబా అన్నారు.
మీరు నా సందేశాలను పదిమందికి తెలియజేయడమే ప్రధానాంశం కాకూడదు.
మీరు ముందుగా నా మాటలు ఆచరించి, అందరికీ ఆదర్శం కావాలి.
లేదంటే నా గురించి, నా సందేశాల గురించి మీరు మౌనంగా వుండటమే
మంచిదని బాబా సూచించారు. మరో ఉదాహరణగా బాబా ఇలా అన్నారు.
ఈ యుగావతారుడు మెహెర్‌బాబా. ఆయనను ప్రేమించండి.
ఆయన సాక్షాత్తూ ఈ కలియుగ అవతారుడు. పురాణపురుషుడు. ప్రేమావతారుడు,
ఎవ్వరిపైనా కోపం వద్దు. ఎవ్వరినీ ద్వేషించొద్దు. మీకు గిట్టనివారిని కూడా మిత్రునిగా
ప్రేమించండి అని బాపిరాజులాంటి బాబా ప్రేమికులు నా ప్రవచనాలు పలువురికి
తెలియజేస్తున్నాడనుకోండి. ఇంతలో స్థానిక గుంపులోనుండి ఎవరో ఒక ఆగంతకుడు
రివ్వున లేచి, పెళ్ళున మీ చెంప చెళ్ళుమనిపించాడనుకోండి, అప్పటిదాకా చెప్పిన
బాబా సందేశాన్ని పక్కనపెట్టి ఆ కొట్టినవానిపై ఒక్క ఉదుటున వెళ్ళితే,
అప్పటిదాకా మీ మాటలు విన్న ఆ జనం మిమ్మల్ని ఏవిధంగా చూస్తారో
మీ గురించి వారేం ఆలోచిస్తారో మీరే ఊహించండన్నారు.
కోపంతో కూడిన ఆలోచనలు తప్పక వస్తాయి.
అయితే వాటిని బహిర్గత పరచకండి. మీకే కనుక అలాంటి ఆలోచనలు రాకపోతే,
మీకూ ప్రాణంలేని రాయికీ తేడా ఏముందని బాబా చమత్కరించారు.

*

# భూమక్క బాబాలో ఐక్యం

శ్రీమతి రావికంటి భూమక్క, మంచిర్యాల సెంటర్ బాబా నామాన్ని స్మరిస్తూ, 12.11.2014న బాబాలో ఐక్యమైయ్యారని శ్రీ దాసరి రంగాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# శ్రీమతి రేపాక బాబాలో ఐక్యం

30.09.2014 మంగళవారం రేపాక సుబ్రహ్మణ్యేశ్వర రావు గారి భార్య శ్రీమతి రేపాక వీరరాఘవమ్మ (రాజమండ్రి అక్కయ్యగారిచెల్లెలు) బాబాలో ఐక్యమయ్యారని స్థానిక బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు.

# నరసన్నపేటలో ఏకాహం

23.11.2014 ఆదివారం ఉ. 7 గం.ల నుండి రాత్రి 7 గం.ల వరకు నరసన్నపేట గ్రామ పంచాయితీ ఆఫీసు ఆవరణలో గల గాంధీ కళా మండపము నందు ఏకనామం **(ఓం పరబ్రహ్మ పరమాత్మ అవతార్ మెహెర్ బాబాకీ జై)** అనే ఘట్టాన్ని చేపట్టినట్లు శ్రీ ఎస్.యం. ప్రసాద్, కె. షణ్ముఖరావు ఒక ప్రకటనలో తెలిపారు.

# కోరి గోపాలపురం

కోరి గోపాలపురం బాబా సెంటర్ నందు బాబా జన్మదిన కార్యక్రమములలో భాగంగా 28.10.2014 నుండి 25.02.2015 వరకు ప్రతిరోజూ సాయంత్రం బాబా సెంటర్ నందు 7 గంటల నుండి 8 గంటల వరకు సత్సంగ్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు శ్రీ కమ్మ మాణిక్యాలరావు, కార్యదర్శి (73826 83267) ఒక ప్రకటనలో తెలిపారు.

# జీవిత సభ్యులు - సోషల్ ఆడిట్

అవతార్ మెహెర్‌బాబా సందేశాల వ్యాప్తికై అంకితమైన మాస పత్రిక మెహెర్‌బాబా. మీ బంధు, మిత్రులు చేత ఒక్కొక్కరు కనీసం ఒకరిద్దరినైనా సభ్యులుగా చేర్పించండి. మెహెర్‌బాబా నామవ్యాప్తికి కృషిచేయండి. మెహెర్‌బాబా పత్రిక ప్రారంభం నుండి 2014 నవంబరు 12, వరకు జీవిత సభ్యత్వం చెల్లించినవారు మొత్తం 800 పైగా ఉన్నారు. జీవిత సభ్యుల వివరాలను సంబంధితులందరికీ తెలియజేసేలా జిల్లాలవారీగా ప్రతినెలా కనీసం ఒకట్రొండు జిల్లాల చొప్పున వీలువెంబడి ప్రచురించాలని నిర్ణయించడమైంది. తప్పొప్పులుంటే సరిదిద్దుకోవడానికి, సంపూర్ణ పారదర్శకత కోసం మేం చేసే ఈ ప్రయత్నంలో దయచేసి సహకరించవల్సింది. మరిన్ని వివరాలకు ఫోన్: 99595 53218 లేదా malladisukku@gmail.com. తెలియజేయండి!!

# జీవిత సభ్యులు

## 2002 – డిశంబరు 2014 వరకు, తూర్పు గోదావరి జిల్లా

| | | | |
|---|---|---|---|
| 1 | Vathsa Syamala Rao, Kakinada | July, 02 | 1000 |
| 2 | Ranganayakamma Ch. Kakinada | Nov, 02 | 1000 |
| 3 | Dr. Vappuri Nikunj, Rajhamundry | Feb, 03 | 1000 |
| 4 | Vishwanadham P. | July, 03 | 1000 |
| 5 | Avatar Meher Baba Mandapeta center | Dec, 03 | 1000 |
| 6 | Rama Krishna Meher K, Rajahmundry | July, 04 | 1000 |
| 7 | Nagender Gandhi.Ch | Feb, 05 | 1000 |
| 8 | Madhusudhan Rao V. Rajamundri | Aug, 05 | 1000 |
| 9 | Kishor VSRajamundri | Aug, 05 | 1000 |
| 10 | Tadi Ramachandra Reddy | Dec, 05 | 1000 |
| 11 | Akbar Krishna,T | Jan, 06 | 1000 |
| 12 | Meher Venkateshwar Rao | Feb, 06 | 1000 |
| 13 | Repaka Subramanyeswara Rao, Kakinada | Aug, 07 | 1000 |
| 14 | Nalla Venkata Subba Rao, Vilasavilli | June, 08 | 1000 |
| 15 | Padala Ratnakumari, Gollaprolu | Nov. 08 | 1000 |
| 16 | D.V.S.S.R. Murthy, Amalapuram | Mar, 09 | 1000 |
| 17 | Ch. Kumara Swamy, K.V.Podu, Malkipuram | Aug, 09 | 1000 |
| 18 | K. Suryanarayana Murthy, Malkipuram | Aug, 09 | 1000 |
| 19 | Ch. Satyavathi, Kakinada | Sep, 09 | 1000 |
| 20 | Maddula Subramanyam, Rajamundry | Nov. 09 | 1000 |
| 21 | Matle Sreemannarayama, Rajahmundry | Nov. 09 | 1000 |
| 22 | Avatar Meher Baba Malkipuram Center | June, 10 | 1000 |
| 23 | Sathivi Reddy, Kunkudooru | Oct, 10 | 1000 |
| 24 | Avatar Meher baba, Rajahmundry center | Jan. 11 | 1000 |
| 25 | Chinnam Venkatram Reddy, Konkuduru | Feb. 11 | 950 |
| 26 | C. Santharam, kakinada | April. 11 | 1000 |
| 27 | C.H.V. Meher Eswar, Davaleswaram | Aug, 12 | 1000 |
| 28 | T. Ganeshwar Rao, Narayanapuram | April, 13 | 1000 |
| 29 | D. Bramhanandam, Jonnada | May, 13 | 1000 |
| 30 | P.S.R. Bose, Rajamundry | May, 13 | 1000 |
| 31 | Tota Baskaramma, Kakinada | July, 13 | 1000 |
| 32 | Ch.V.V. Satyanarayana, Mandapeta | April - 14 | 1000 |
| 33 | Y. Sri Nagesh, Kakinada | July - 14 | 1000 |

## జీవిత సభ్యత్వం రెండు దఫాలుగా చెల్లించినవారి వివరములు

**2002 –** సెప్టెంబరు 2014 వరకు, తూర్పు గోదావరి

| | | | |
|---|---|---|---|
| 34 | Arava Venkata Rama Krishna, Rajamandry | Aug, 02 | 500 |
| | Arava Venkata Rama Krishna, Rajamandry | Dec, 02 | 500 |
| 35 | G. Ramarao, Malkipuram | Feb, 12 | 500 |
| | G. Ramarao, Malkipuram | Dec, 12 | 500 |
| 36 | Jilla Grandhalaya Samstha, Mandapet, | Aug, 05 | 500 |
| | Jilla Grandhalavy Samstha, Mandapet | Jan, 06 | 500 |
| 37 | Kalyani K.L. Rajamundry | July, 02 | 500 |
| | Kalyani. K.L, Rajamandry | July, 03 | 500 |
| 38 | Mukku Laxminarayana, Rajahmundry | Feb, 09 | 500 |
| | Mukku Laxminarayana, RAJAHMUNDRY | Feb, 10 | 500 |
| 39 | Prasad Rao P.V.V | Sept, 05 | 500 |
| | Prasadarao P.V.V | Nov, 04 | 500 |
| 40 | Meher Anirudh, Kakinada | July, 07 | 500 |
| | Rajmeher Anirud P. Kakinada | Nov, 03 | 500 |
| | Rajmeher Anirudh, Kakinada | Apr, 03 | 500 |
| 41 | Srirama Bhaktha Pustaka Bhandagaram | Aug, 08 | 500 |
| | Srirama Bhaktha Pusthaka Bhandagaram | Sept, 07 | 500 |
| 42 | Tripurasundari S.V. Kakinada | Jun, 05 | 500 |
| | S.V. Tripura Sundari, Kakinad\ | Mar - 14 | 500 |
| 43 | P. Subbaramaiah, Kandregula | Feb - 14 | 500 |
| | P. Subbaramaiah, Karapa | July - 14 | 500 |
| 44 | Murthy Rentala, Mandapeta | July, 10 | 500 |
| | R.N. Murti, Mandapet | July, 14 | 500 |

## జీవిత సభ్యత్వం కొరకు ఒక దఫా మాత్రమే చెల్లించినవారి వివరములు

**2002 –** సెప్టెంబరు 2014 వరకు, తూర్పు గోదావరి

| | | | |
|---|---|---|---|
| 1 | B. Lakshmi, Pithapuram | Oct. 09 | 500 |
| 2 | B. Srinivas Rao, Rajamundry | July, 10 | 500 |
| 3 | T.P.Somaraju, Rajahmundry | Feb, 09 | 600 |
| 4 | R.Meher Prasad | Nov, 06 | 500 |
| 5 | Raja. A, AMALAPURAM | Feb, 10 | 500 |
| 6 | Narayana Rao, Rajahmundry | July, 14 | 500 |

# జీవిత సభ్యతం

**2014 నవంబరు - డిసెంబరు నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | డిసెంబరు | చుండూరి ఎల్.ఎన్.కె. ప్రసాద్ | రూ. 500.00 |
| | | **మొత్తం** | **రూ. 500.00** |

మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973. IFSC CODE: IOBA 0001732.**

**మా అడ్రస్:**

ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,
యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ పోస్టు
సికింద్రాబాద్-500087, ఫోన్ 99595-53218,
**email: malladisukku@gmail.com**

# విరాళం

హైదరాబాద్ బాబా ప్రేమికులు మెహెర్‌బాబా పత్రిక ప్రచురణకై రెండువేల రూపాయలు, (రూ. 2,000) విరాళంగా ఇచ్చారు. తమ పేరు ముద్రించరాదని కోరారు.

# హెల్ప్‌లైన్

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే, ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి.ఆర్.కె.శాస్త్రి (98492 42284), శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం.**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month